PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 3 | విజయవాడ, గురువారం 3 ఆగస్టు 2023 | 6+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 3 August 2023 | Rs



సిరీస్ విజేత టీమిండియా

- చివరి వన్డేలో 200 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై గెలుపు
- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ఇషాన్

ఇంపిసెట్ వెబ్ ఆప్షన్లు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష అడ్మిషన్ల కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఈ నెల 3 నుంచి ప్రారంభం కావాల్సిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఇపిసెట్ అడ్మిషన్ల కన్వీనరు సిహెచ్ నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 12 వరకు వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ జరగనుందని తెలిపారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యకలాపాలకు సంబంధించిన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌లో ఎంపికలు, మార్పులు, సీట్ల కేటాయింపు, సంస్థల్లో నివేదించడం, తరగతుల ప్రారంభం వంటి షెడ్యూల్‌లో కూడా మార్పులు ఉంటాయని వివరించారు. 13న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపారు. 17న విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేస్తామని పేర్కొన్నారు. 17 నుంచి 21లోపు సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని వెల్లడించారు. ఆగస్టు 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇంజినీరింగ్ ఫీజుల అంశం కోర్టు పరిధిలో ఉండటంతో కౌన్సెలింగ్ షెడ్యూల్ వాయిదా పడింది.

మణిపూర్‌లో శాంతి అవశ్యం

అసాధారణ పరిస్థితిని పరిష్కరించాలని రాష్ట్రపతికి ప్రతిపక్షాల వినతి

- చర్చకు కేంద్రం నిరాకరిస్తోంది
- ఇంటర్నెట్ నిషేధంతో సడలిన విశ్వాసం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆలస్యం చేయకుండా మణిపూర్‌లో శాంతి స్థాపనకు జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రతిపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. మణిపూర్ రాష్ట్రం ఎదుర్కొంటున్న అసాధారణ పరిస్థితిని వీలైనంత త్వరగా పరిష్కరించి, తక్షణమే సాధారణ స్థితికి తీసుకురావాలని కోరారు. రెండు రోజుల పాటు మణిపూర్‌లో పర్యటించిన 21 మంది ఎంపిలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతి పత్రం సమర్పించారు. "గత కొన్ని నెలలుగా మణిపూర్‌లో పరిస్థితి క్లిష్ట స్థితికి చేరుకుంది. శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆన్‌లైన్‌లో వెలువడిన షాకింగ్ వైరల్ వీడియో దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ విషయాన్ని వెంటనే పరిష్కరించడంలో రాష్ట్ర పరిపాలన వ్యవస్థ, పోలీసులు విఫలమయ్యారని స్పష్టంగా తెలుస్తుంది. విచారణ చేపట్టి నిందితుడిని పట్టుకునేందుకు రెండు నెలలకు పైగా జాప్యం చేయడం సమస్య తీవ్రతను మరింత పెంచింది. మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన అనేక కేసుల్లో ఒక ఘటన మాత్రమే వెలుగులోకి వచ్చింది" అని తెలిపారు. "బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఇండియా కూటమి పార్టీలకు చెందిన 21 మంది పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందం జూలై 29-30 రెండో రోజుల పాటు మణిపూర్‌లోని హింస ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, మణిపూర్ ప్రజలకు సంఘీభావ సందేశాన్ని ఇచ్చి, వాస్తవికతను అంచనా వేసింది. మహిళలు, పిల్లలతో సహా ప్రజలు ఎదుర్కొంటున్న విధ్వంసం, కష్టాలను ఎంపీలు చూశారు. భయంకరమైన, పరిస్థితుల గురించి దేశానికి తెలియజేశారు. ఈ బృందం మణిపూర్ గవర్నర్‌ను కూడా కలిసి వాస్తవ పరిస్థితులను తెలియజేసింది. గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించింది" అని ప్రతిపక్ష నాయుకులు రాష్ట్రపతికి వివరించారు.


రాష్ట్రపతితో సమావేశమైన ప్రతిపక్షాల నాయకులు

"హింసాకాండతో మణిపూర్ వినాశకరంగా మారింది. 200 కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. 500 మందికి పైగా తీవ్ర గాయాలు అయ్యాయి. 5 వేల కంటే ఎక్కువ ఇళ్లు దగ్ధం అయ్యాయి. 60 వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. సహాయక శిబిరాల్లో దుర్భరమైన పరిస్థితుల్లో బాధితులు నివసిస్తున్నారు. చురచంద్‌పూర్, మోయిరాంగ్, ఇంఫాల్‌తో సహా మూడు విభిన్న సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లోని సహాయక శిబిరాలను ప్రతినిధి బృందం సందర్శించింది. అక్కడ బాధితులతో సంభాషించారు. వారి సమస్యలను విన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా చూశారు. సహాయక శిబిరాల్లో ఉన్న ప్రజలు ఆహారం, సహాయక సామాగ్రి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు భయం, అభద్రతా స్థితిలో జీవిస్తున్నారు. వారి జీవితాలను పునర్నిర్మించుకోవడానికి సురక్షితమైన, న్యాయమైన పునరావాసం అవసరం. రాష్ట్రంలో మూడు నెలల పాటు ఇంటర్నెట్ నిషేధం వివిధ వర్గాల మధ్య అపనమ్మకాన్ని మరింత పెంచింది. తప్పుడు సమాచారం వ్యాప్తికి అనుమతించింది. దాదాపు మూడు నెలల పాటు పాఠశాలలు, కళాశాలలను సుదీర్ఘంగా మూసివేయడం మణిపూర్‌లో పిల్లలు, యువత విద్యపై ప్రతికూల ప్రభావం చూపింది" అని వినతిపత్రంలో తెలిపారు.

"ఈ సందర్భంలోనే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి, ఇండియా కూటమి పార్టీలు ప్రధానమంత్రి నుండి ప్రకటనను డిమాండ్ చేస్తున్నాయి.

అత్యంత జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ అంశంపై వివరణాత్మక, సమగ్ర చర్చ జరగాలని కోరుతున్నాయి. సంబంధిత నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చినప్పటికీ, ఈ డిమాండ్లు పార్లమెంట్ ఉభయ సభల్లో తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ అంశంపై అర్థవంతమైన చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారు. రాజ్యసభలో ప్రజల వాణి వినిపించే ప్రతిపక్ష నేతల నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారు. తాము మాట్లాడకుండా మైక్ కట్ చేస్తున్నారు. దీన్ని మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కొత్తగా తీసుకురావడం చాలా ఆందోళన కలిగిస్తుంది" అని అన్నారు.

"ఇకనైనా ఆలస్యం చేయకుండా రాష్ట్రంలో శాంతి సామరస్యాలను నెలకొల్పేందుకు దయతో జోక్యం చేసుకోండి. గత 92 రోజులలో జరిగిన విధ్వంసానికి బాధ్యులను గుర్తించాలి. బాధిత వర్గాలకు న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రెండూ తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితులపై పార్లమెంట్‌లో అత్యవసరంగా ప్రసంగించవలసిందిగా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలి. ఆ తరువాత ఈ విషయంపై వివరణాత్మక, సమగ్రమైన చర్చ జరగాలి" అని కోరారు. మణిపూర్ ప్రజల బాధలను తొలగించడంలో, రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో జోక్యం చేసుకోవాలని వారు రాష్ట్రపతిని కోరారు.

అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ మణిపూర్ సమస్యను రాష్ట్రపతికి వివరించామని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మణిపూర్‌లో పర్యటించి, శాంతిని పునరుద్ధరించేందుకు కృషి చేయాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని అన్నారు. మణిపూర్‌లో పర్యటించిన 21 మంది ఎంపిలతో పాటు శరద్ పవర్ (ఎన్‌సిపి), సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి), తిరుచ్చి శివ (డిఎంకె), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), వైకో (ఎండిఎంకె), జోష్ కె. మణి (కేరళ కాంగ్రెస్), ఎఎ రహీం (సిపిఎం), సంజయ్ సింగ్ (ఆప్), సంజయ్ రౌత్ (శివసేన ఠాక్రే), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి) తదితరులు రాష్ట్రపతిని కలిసినవారిలో ఉన్నారు.


వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ - టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యాక్రమాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

రక్తహీనత తొలగిపోవాలి

- మహిళా శిశుసంక్షేమశాఖపై సమీక్షలో సిఎం
- 'టేక్‌హోమ్ రేషన్' ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రక్తహీనత పూర్తిగా తొలగిపోవాలని, పోషకాహారం ప్రతి ఒక్కరికీ అందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మహిళా శిశుసంక్షేమశాఖపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలుకు ఇచ్చే వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్నిఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్రై రేషన్ కింద ఇచ్చే సరుకులు నాణ్యతపై అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని పేర్కొన్నారు. రక్తహీనత, పౌష్టికాహారలేమి లాంటి సమస్యలు పూర్తిగా తొలగిపోవాలనే లక్ష్యంతో ఈ పనిచేస్తున్నామని వివరించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారుల కోసం గత ప్రభుత్వం ఏడాదికి రూ.450 కోట్ల నుండి రూ.500 కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం ఏడాదికి రూ.2300 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, అక్కడ పిల్లలు, తల్లులు బాలింతల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని కోరారు. బాల్యవివాహాల నిరోధం, అక్షరాస్యత పెంపు, చదవుల్లో బాలికలను ప్రోత్సహించే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండాలని, ఫౌండేషన్ స్కూళ్లలో ఇంగ్లీషు ఉచ్ఛారణపై దృష్టి సారించాలని తెలిపారు.

నిర్దేశించిన సిలబస్ బోధనా పద్ధతులతో నేర్పించే అంశాలపై దృష్టి పెట్టాలని సిఎం సూచించారు. మూడో తరగతి నుండే టోఫెల్ శిక్షణ మొదలైందని పేర్కొన్నారు. ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థులకు ప్రత్యామ్నాయ బోధనా విధానాలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా మాంటిస్సోరి విద్యావిధానంపై చర్చించిన సిఎం మాంటిస్సోరి విద్యా సంస్థలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

'సీమ'కు గోదావరి నీరు తరలిస్తాం

- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిలో జగన్ విఫలం
- పులివెందుల సభలో చంద్రబాబు


పులివెందుల సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/యంత్రాంగం

గోదావరి నీటిని రాయలసీమకు తరలిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిలో ముఖ్యమంత్రి జగన్ విఫలయ్యారని విమర్శించారు. రాష్టంలోని నాగార్జున సాగర్, పట్టిసీమల ద్వారా 280 టిఎంసిలను నిల్వ చేసుకునే అవకాశం ఉందని, వాటిని నల్లమలలో సొరంగం తవ్వి రాయలసీమకు తరలిస్తామని అన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం మండల కేంద్రంలోని సిబిఆర్ లిఫ్ట్ స్కీమ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని తిమ్మాపురంలో రైతులతో ముఖాముఖి, పులివెందుల నియోజకవర్గ కేంద్రంలో రోడ్ షో నిర్వహించి భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధం కార్యక్రమంలో భాగంగా ముందుగా తిమ్మాపురం రైతుల సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్టంలోని సాగునీటి ప్రాజెక్టు పనుల్లో అధికం ముఖ్యమంత్రి తన మంత్రివర్గ సహచరులకే కట్టబెట్టారని విమర్శించారు. జిఎన్‌ఎస్ఎస్-హెచ్‌ఎన్ఎస్ఎస్, గండికోట సొరంగం పనుల పేరుతో దోపిడీకీ స్కెచ్ వేశారని ఆరోపించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేని సిఎం జగన్ కొత్త ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి తెరలేపారని దుయ్యబట్టారు. కొత్తగా పది ప్రాజెక్టులంటూ రూ.12 వేల కోట్ల దోపిడీకి సిద్ధమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకుండా ఏడిపిస్తున్నారని, మంత్రి పెద్దిరెడ్డికి మాత్రం రూ.600 కోట్ల బిల్లులను సెటిల్ చేశారని అన్నారు. ఏ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఎవరికి పేరు వస్తుందోనని పెండింగ్ ప్రాజెక్టులను వదిలేశారని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టులను రద్దు చేసి 23 ప్రాజెక్టులతో రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం పేరుతో జగన్ డ్రామాలాడుతున్నారన్నారు. నాలుగేళ్లలో ఒక్కటీ పూర్తి చేయలేదని విమర్శించారు. నెలకోసారి ఢిల్లీ వెళ్లే జగన్ ఈ ప్రాజెక్టులపై కెఆర్ఎంబి, ఎన్‌జిటి, సిడబ్ల్యుసి నుంచి ఎలాంటి అనుమతులూ తేలేకపోయారన్నారు. ఆగస్టు 2వ తేదీ వచ్చినా శ్రీశైలం మోటార్లు ఇంకా ఆన్ కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఆ నీటిని బనకచర్లకు తెచ్చి ఉంటే ఈ సమస్య మిగతా 5లో

ప్రతిపక్ష సభ్యులు లేకుండానే రాజ్యసభలో అటవీ సంరక్షణ బిల్లు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఉభయ సభల్లో బుధవారం కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. అయినా సరే రాజ్యసభలో అటవీ సంరక్షణ బిల్లుతో సహా బుధవారం మొత్తంగా మూడు బిల్లులు ఆమోదం పొందాయి. ప్రతిపక్ష సభ్యులు సభలో లేకుండానే ఈ బిల్లులు ఆమోదం పొందాయి. బుధవారం ముందుగా దేశంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలు గురించి మాట్లాడ్డానికి అనుమతి ఇవ్వాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ప్రతిపక్ష సభ్యులు కోరారు. డిప్యూటీ చైర్మన్ అనుమతికి నిరాకరించారు. దీంతో రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. తరువాత కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ అటవీ సంరక్షణ బిల్లును చర్చకు ప్రవేశపెట్టారు. బిజెపి, వైసిపి, అన్నాడిఎంకె, బిజెడికి చెందిన పార్టీల ఎంపిలు మాట్లాడిన తరువాత బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. అలాగే లిథియం, ఐదు ఇతర ఖనిజాలను తవ్వడానికి ప్రైవేట్ వ్యక్తులకు అనుమతించే గనులు, ఖనిజాల సవరణ బిల్లును, జన విశ్వాస్ సవరణ బిల్లులను కూడా ఆమోదించారు.

పచ్చని పైర్లపై బుల్డోజర్

- పోర్టుకు భూములివ్వని వారి పంటలు ధ్వంసం
- తహశీల్దార్‌ను నిలదీసిన రైతులు


పంటలను యంత్రాలతో ధ్వంసం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నౌపడ

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేటలోని గ్రీన్‌ఫీల్డ్ పోర్టు భూసేకరణకు భూములు ఇవ్వని రైతుల పొలాల్లోని పంటలను రెవెన్యూ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. మూలపేటలోని సుమారు 20 మంది రైతులు పోర్టుకు భూములివ్వలేదు. భూములివ్వని వారు, భూములిచ్చిన వారు తమ భూముల్లో పంటలను పండిస్తున్నారు. పోర్టు భూసేకరణ నోటిఫికేషన్ పరిధిలోని ప్రాంతాల్లో భూములను చదును చేయాలన్న కలెక్టర్ ఆదేశాలతో టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి నేతృత్వాన పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు పొలాల వద్దకు చేరుకున్నారు. యంత్రాలతో పంట పొలాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మూలపేట నిర్వాసితులు పొలాల వద్దకు వెళ్లి అధికారులను ప్రశ్నించారు. కనీసం సమాచారం ఇవ్వకుండా పొలాలను ధ్వంసం చేయడం ఏమిటని తహశీల్దార్ చలమయ్యను నిలదీశారు. తాము ప్రభుత్వానికి భూములు ఇవ్వలేదని, అటువంటప్పుడు ఎలా ధ్వంసం చేస్తారని ప్రశ్నించారు. పరిహారం పూర్తిస్థాయిలో అందించకుండా పంటలను ఎందుకు తొలగిస్తున్నారని భూములు ఇచ్చిన రైతులు ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకే చేస్తున్నామని, ఏమైనా ఉంటే కలెక్టర్, టెక్కలి సబ్‌కలెక్టర్‌తో మాట్లాడాలని తహశీల్దార్ సూచించారు. దీంతో రైతులు యంత్రాలను అడ్డుకున్నారు. మీ డిమాండ్లను సబ్ కలెక్టర్‌కు తెలియజేయాలని, యంత్రాలను అడ్డుకుని ఇబ్బందులు సృష్టించవద్దని పోలీసులు హెచ్చరించారు. కొంత సమయం కావాలని రైతులు అడిగినా అధికారులు వినిపించుకోలేదు. పోలీసు బందోబస్తు మధ్య రాత్రి కూడా పొలాలను చదును చేశారు.

రుషికొండపై అక్రమ నిర్మాణాలు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ జిల్లాలోని రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు, నిర్మాణాలు జరిగాయని నివేదికలు చెబుతున్నట్లు హైకోర్టు ప్రకటించింది. ఆ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలను (ఎంఒఇఎఫ్) ఆదేశిస్తామని చెప్పింది. సుప్రీంకోర్టు అనుమతిచ్చిన మేరకు నిర్మాణాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని చీఫ్ జస్టిస్ డిసి ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. రుషికొండలో నిర్మాణాలు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయంటూ పలువురు వేసిన వేర్వేరు వ్యాజ్యాలను విచారించిన హైకోర్టు గతంలో ఒక కమిటీ వేసింది. నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు, నిర్మాణాలు జరిగాయని ఆ కమిటీ హైకోర్టుకు నివేదిక ఇచ్చింది. 9.88 ఎకరాల్లో నిర్మాణాలకు అనుమతి ఉంటే 17.96 ఎకరాల్లో పనులు జరిగాయని తేల్చింది. దీనిపై చర్యలకు ఎంఒఇఎఫ్‌కు పంపే అంశంపై తగిన ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు ప్రకటించింది.

హింస జరగరాదు, విద్వేష ప్రసంగాలు చేయరాదు!

- సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : మతోన్మాద హింస చోటు చేసుకున్న హర్యానాలోని నుహ్ జిల్లాలో విహెచ్‌పి, బజరంగ్‌దళ్ సంస్థలు హింసను ప్రేరేపించడం, ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు చేయడం వంటి వాటికి పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని, పోలీసులను కోరింది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. "ద్వేషపూరిత ప్రసంగం వాతావరణాన్ని దెబ్బ తీస్తుందనే అంశంపై ఎలాంటి తగాదా వుండరాదు. ఎలాంటి హింస జరగకుండా, విద్వేష ప్రసంగాలు చేయకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. సంబంధిత రాష్ట్ర అధికారులతో కేంద్రం వెంటనే మాట్లాడాలి. చట్టబద్ధ పాలన నెలకొనాలి." అని జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. ప్రదర్శనల సందర్భంగా శాంతి భద్రతల పరిస్థితులకు విఘాతం కలగకుండా చూసేలా కేంద్ర, రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలని కోరింది.

విద్వేష ప్రసంగాలు చేసేవారిపై ఎఫ్ఐఆర్‌లు

విద్వేష ప్రసంగాలు ఎవరు చేసినా సుమోటోగా కేసు నమోదు చేయాలని పోలీసులను, రాష్ట్రాల అధికారులను కోరుతూ గతేడాది అక్టోబరు 21న జారీ చేసిన ఆదేశాలను బెంచ్ ఈ సందర్భంగా కేంద్రానికి గుర్తు చేసింది. కోర్టు ఆదేశాలకు తాము కట్టుబడి వుంటామని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్ వి రాజు హామీ ఇచ్చారు. పొరుగునున్న హర్యానాలో హింస జరుగుతోందని, రాజధానికి 23 నిరసన ప్రదర్శనలు వస్తున్నాయని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సి.యు.సింగ్ తెలిపారు. ఆ కార్యక్రమాలను ప్రదర్శనలుగా పేర్కొన్నప్పటికీ ఇప్పటికే విద్వేష ప్రసంగాలు చోటు చేసుకున్నాయని అన్నారు. ఎక్కడా హింస పెచ్చరిల్లకుండా అధికారులు ముందు జాగ్రత్తతో వ్యవహరించాలని జస్టిస్ ఖన్నా సూచించారు. తమ అధికార పరిధిలో జరిగే ఎలాంటి హింసనైనా ఏ ప్రభుత్వమూ ఇష్టపడదని అన్నారు. సుప్రీం కోర్టు అత్యవసరంగా ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ న్యాయవాది సింగ్ రెండు వేర్వేరు బెంచ్‌ల ముందు ఈ పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ప్రాధాన్యతా ప్రాతిపదికన కేసును విచారణకు స్వీకరించారు. తిరిగి శుక్రవారం స్పెషల్ బెంచ్ దీనిపై విచారణ జరపనుంది.

గూడు చూసి గుండెలవిసే

- వరదల్లో దెబ్బతిన్న ఇళ్లు
- ముంపు గ్రామాల్లో ఎటుచూసినా బురదే


విఆర్.పురం మండలంలో దెబ్బతిన్న కమ్మల ఇల్లును పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి- విఆర్.పురం (అల్లూరి జిల్లా)

వరదలకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంపు మండలాలవాసుల గృహాల్లో చాలా వరకు దెబ్బతిన్నాయి. నిన్నటి వరకూ వరద భయంతో గుట్టలపైనా, పునరావాస కేంద్రాల్లోనూ తలదాచుకున్న వారంతా వరద తగ్గడంతో తమ గూడేలకు వచ్చి అక్కడి పరిస్థితిని చూసి బోరుమన్నారు. కూలిన పాకలు, బీటలు వారిన గోడలు, బురదలో చెల్లాచెదురుగా పడి ఉన్న గృహోపకరణాలను చూసి లోలోపల కుమిలిపోతున్నారు. ప్రస్తుతం గోదావరి, శబరి నదుల వరద తగ్గడంతో విఆర్.పురం మండలంలోని వడ్డిగూడెం, ధర్మతాలగూడెం, రాజుపేట, వడ్డుగూడెం కాలనీల ప్రజలు ఇళ్లకు చేరుకున్నారు. ఏడెనిమిది రోజుల క్రితం వీరంతా వరద హెచ్చరికల నేపథ్యంలో పరుగు పరుగున సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. మోయగలిగిన సామాన్లు మాత్రమే వారి వెంట తీసుకెళ్లారు. పరిస్థితి కాసింత చక్కబడిందని భావించి ఇప్పుడు వారంతా ఇళ్ల వచ్చారు. ఎక్కడ చూసినా బురద మేటలే కనిపించాయి. పశువుల పాకలు నేలమట్టమయ్యాయి. బురదను తొలగించేందుకే రూ.10 వేలు నుంచి రూ.60 వేలు వరకూ ఖర్చవుతుందని, తామంత ఖర్చు పెట్టే స్థితిలో లేమని పలువురు బాధితులు వాపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. చేతిపంపుల్లో బురద నీరే వస్తోందని, తాగుదామన్నా శుభ్రమైన నీరు లేదని ఆవేదన చెందారు. పంటలకూ నష్టం వాటిల్లింది. వడ్డిగూడెం ప్రజలు దొండ తోటలు వేశారు. ఒక్కో కుటుంబం వీటి సాగుకు అధికంగానే ఖర్చు చేసింది. ఒక్కో సాగుదారునికీ కనీసం రూ.60 వేల మేర నష్టం వాటిల్లింది. చింతూరు మండలం కుమ్మూరు, మల్లెతోట, ఎజి.కోడేరుల్లోనూ, కూనవరం మండలం ఉదయ్‌భాస్కర్ కాలనీ, కూనవరం గ్రామాల్లోనూ నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది.

- (మరిన్ని ఫొటోలు, అభిప్రాయాలు 2లో..)

సామాన్లు కొట్టుకుపోయాయి



వరదకు ఇంట్లో సామాన్లన్నీ కొట్టుకుపోయాయి. రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లింది. చేతికొచ్చేవేళ.. దొండ తోట వరద పాలైంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

-కాపారపు మురళి, వడ్డుగూడెం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఊహించని నష్టం జరిగింది. ఇళ్లన్నీ దెబ్బతిన్నాయి. పుట్టెడు దుఃఖంలో ఉన్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి. పోలవరం ముంపు గ్రామాలన్నింటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి, శాశ్వత పునరావాసం కల్పించాలి.

-కారం బుచ్చమ్మ, రామవరం సర్పంచ్

కేడర్ స్ట్రెంగ్త్‌లోకి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను కేడర్ స్ట్రెంగ్త్‌లో చూపాలంటూ పంచాయతీ కార్యదర్శుల పోరాటం ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజులకు ఆరు అంశాలకు సంబంధించిన శిక్షణ తరగతులు ప్రభుత్వం నిర్వహించనుంది. శిక్షణకు సంబంధించి ఈ నెల 2న పంచాయతీరాజ్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, పేరిట విడుదలైన లేఖలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు రాష్ట్రంలో ఉన్న 14,989 పంచాయతీ కార్యదర్శులు కేడర్ స్ట్రెంగ్త్‌ను పూర్తిస్థాయిలో ధ్రువీకరిస్తూనే, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 6,166 మందిని కేడర్ స్ట్రెంగ్త్‌లో చూపడం పట్ల గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి జానీ పాషా హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

సిఎంతో ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భేటీ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ బుధవారం జరిగింది. రాష్ట్రంలో 60 వేలమంది ఎన్‌సిసి క్యాడెట్లు వున్నారని సిఎంకు వీఎం రెడ్డి వివరించారు. రాష్ట్రంలో ఎన్‌సిసి విస్తరణకు ఎక్కువ అవకాశాలు వున్నాయని, ప్రభుత్వం నుండి సహకారం అందించాలని కోరారు. అలాగే ఎన్‌సిసి అందించే సేవలపై చర్చించారు. ప్రతి జిల్లాలో ఎన్‌సిసి దళాలు విపత్తులు ఎదురైనప్పుడు సేవలు అందించేందుకు సిద్ధం చేసి వుంచుతామని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులకు సమర్ధవంతమైన శిక్షణ అందించేందుకు వీలుగా సెంట్రల్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేస్తే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని సిఎం తెలిపారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్ క్యాడెట్ల శిక్షణ అందించాలని కోరారు. సమావేశంలో ఎన్‌సిసి అసిస్టెంట్ డైరెక్టర్ కల్నల్ సంజయ్ గుప్తా, గ్రూప్ కమాండర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా భూముల రీసర్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న శాశ్వత భూ హక్కు, రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో బుధవారం రీసర్వే ప్రక్రియ, నూతన కలెక్టరేట్లలో సిబ్బంది నియామకంతోపాటు పలు అంశాలపై రెవెన్యూశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ, గనులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి (హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్సు కమిషనరు సిద్ధార్థజైన్, అదనపు సిసిఎల్ఎ ఇంతియాజ్, స్వామిత్ర ప్రత్యేక కమిషనరు ఎ సిరి పాల్గొన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ఆనకట్ట రేడియల్ క్రస్ట్ గేట్ల వరకు నీటిమట్టం చేరుకుంది. కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జూరాల నుంచి 77,921 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 886 క్యూసెక్కులతో కలిపి 78,807 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రం జలాశయ నీటిమట్టం 854.10 అడుగులకు చేరగా, నీటి నిల్వ సామర్థ్యం 89.5016 టిఎంసిలుగా నమోదయింది. ఎడమగట్టు తెలంగాణ పరిధిలోని జల విద్యుత్తు కేంద్రంలో గడచిన 24 గంటలలో 417 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుని 0.247 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనను చేయడం లేదని గేజింగ్ సిబ్బంది తెలిపారు.

రైల్వేశాఖతో చర్చించాలి : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వే కోర్స్ కంప్లీటెడ్ యాక్ట్ అప్రెంటీస్ (సిసిఎఎ) ఉద్యోగ ప్రకటన నాటికి అప్పటికే కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు నియామకాలు చేయకుండా పక్కనపెట్టడం దురదృష్టకరమని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్న ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ఎలా పరిష్కరించారో అదే తరహాలో ఏపి, తెలంగాణ ప్రభుత్వాలు రైల్వే మంత్రిత్వశాఖతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

హమాలీలకు పని భద్రత కల్పించాలి

- హమాలీ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర సదస్సులో నాయకుల డిమాండ్



విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న సిహెచ్ నరసింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హమాలీ జట్టు, ముఠా, కళాసీ కార్మికులకు పని భద్రత కల్పించాలని హమాలీ కార్మికుల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. బుధవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. తొలుత మణిపూర్‌లో మతోన్మాద దాడులకు బలైన ఆదివాసీలకు, ప్రకాశం జిల్లా టంగుటూరు అంగన్‌వాడీ హనుమాయమ్మకి ఈ సదస్సు సంతాపం ప్రకటించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఐదు లక్షల మంది ముఠా కార్మికులకు గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చట్ట అమలకు వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదంలో చనిపోయిన వారికి 10 లక్షల రూపాయలు, సాధారణ మరణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక చట్టాల అమలు కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కార్మిక చట్టాలను వామపక్ష ప్రభుత్వాలు అమలు చేశాయని తెలిపారు. వలస కార్మికుల రక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని పేర్కొన్నారు. అధికారుల వేధింపులు, అధిక జరిమానాలు, అక్రమ కేసులతో హమాలీలు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుండి సెస్ వసూలు చేయాలని కోరారు. హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆగస్టు 9న చేపట్టనున్న బిజెపి హఠావో, దేశ్‌కా బచావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఎం. సీతారాములు అధ్యక్షతన జరిగిన . ఈ సదస్సులో ఫెడరేషన్ నాయకులు కాలం సుబ్బారావు, ఎ.గోపాల్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

రోజుకు రూ.3 కోట్లు ముడుపులు

- వినుకొండ సభలో సిఎం జగన్‌పై లోకేష్ విసుర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇసుక మాఫియా నుంచి సిఎం జగన్‌కు రోజుకు రూ.3 కోట్లు అందుతున్నాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. నదుల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడం వల్ల ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర పల్నాడు జిల్లా నూజెండ్ల, వినుకొండ మండలాల్లో సాగింది. వినుకొండ పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం తర్వాతే ఓట్లు అడుగుతానని ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. గత నాలుగేళ్లలో మద్య నిషేధం ఘోరంగా విఫలమైందని, ఇప్పుడు ఏం మొఖం పెట్టుకొని మహిళలను ఓట్లు అడుగుతాడని ప్రశ్నించారు. టిడిపి హయాంలో రూ.1500 ఉన్న ట్రాక్టర్ ఇసుక జగన్ పాలనలో రూ.5 వేలు పలుకుతోందన్నారు27 దళిత సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారని విమర్శించారు. వినుకొండ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పేరు కబ్జాల రాయుడుగా ఆయన అభివర్ణించారు. పలు చోట్ల భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వినుకొండలో ఏ పని జరగాలన్న ఎమ్మెల్యేకి "బీ ట్యాక్స్' చెల్లించాల్సిందేనని విమర్శించారు. కబ్జాల రాయుడు భూకబ్జాలపై ప్రత్యేక సిట్ వేస్తామని, భూములు అన్ని వెనక్కి తీసుకోని పేదలకు పంచుతామని తెలిపారు. టిడిపి నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వాళ్లు వినుకొండలో ఉన్నా... విదేశాల్లో ఉన్నా.. పట్టుకొచ్చి లోపలేస్తానని హెచ్చరించారు.

9న క్విట్ కార్పొరేట్ పేరిట నిరసనలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఆగస్టు 9న 'క్విట్ ఇండియా' స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో విశాఖలో తలపెట్టిన నిరసన కార్యక్రమాలను కార్మికులు జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 902వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ విభాగం ప్రతినిధులు, విశ్రాంతి ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన కొకింగ్ కోల్‌ను అదానీ గంగవరం పోర్టు నిర్బంధించడం దారుణమన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్న క్రమంలోనే ఇటువంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో అదానీ పోర్టుపై పోరాటం సాగించాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు వైటి.దాస్, విళ్లా రామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. రానున్న కాలంలో ప్రజలు మోడీ సర్కారుకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో సింటర్ ప్లాంట్ విశ్రాంత కార్మికుడు రమణరావు, విభాగం కార్మికులు ఎ.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, నారాయణరావు, కె.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అలవెన్సుల్లో కోత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పోలీసులకు, ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇప్పటి వరకూ ప్రభుత్వ ఉద్యోగులకు, పోలీసులకు వున్న అలవెన్సులను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి జిఓ నెంబరు 79ని విడుదల చేశారు. పోలీసులకు దశాబ్దాలుగా కొనసాగుతున్న అలవెన్సులతోపాటు ఇతర విభాగాల్లోకి డిప్యూటేషన్‌పై వెళ్లేవారికి ప్రత్యేక అలవెన్సులు వుండేవి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దిశ విభాగంలో పనిచేసే వారికి వున్న 30 శాతం అలవెన్సును రద్దు చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే యాంటీ నక్సలిజం స్క్వాడ్ సిబ్బందికి ఇచ్చే 15 శాతం అలవెన్సును తొలగించారు. ఏజెన్సీలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు అడిషనల్ హెచ్‌ఆర్ఎను ఈ ఉత్తర్వులతో తొలగించారు. డిప్యూటేషన్‌పై ఎసిబిలో పనిచేస్తే వున్న 30 శాతం అలవెన్సును 25 శాతానికి కుదించారు. ఎసిబిలో నేరుగా రిక్రూట్ అయినవారికి వున్న 10 శాతం అలవెన్సును 8 శాతానికి తగ్గించారు. దశాబ్దాలుగా పోలీసులకు ఇచ్చే సైకిల్ అలవెన్సుకు మంగళం పాడారు. ఈ ఉత్తర్వులతో అన్ని స్థాయిల్లోని పోలీసులకు వేతనంలో కోతలు పడనున్నాయి. అలాగే ఈ ఉత్తర్వులతో పలుశాఖలకు చెందిన ఉద్యోగుల అలవెన్సుల్లో భారీగా కోత పడనుంది.

'బదిలీ' ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

- రేపు జిల్లా కేంద్రాల్లో నిరసన
- యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. యుటిఎఫ్ కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. జూన్ 12 నాటికి బదిలీలు, జూన్ 25 నాటికి వివిధ కేడర్ల ప్రమోషన్లు పూర్తయినా ఇప్పటికీ బదిలీలైన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించలేదని అన్నారు. కేడర్ స్ట్రెంగ్త్ అప్‌డేట్ చేస్తున్నామనే పేరుతో చెల్లించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బదిలీల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించామని చెప్పిన విద్యాశాఖ, జీతాలు సకాలంలో చెల్లించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఉపాధ్యాయులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ జూన్, జులై నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 4న సాయంత్రం అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారుల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కార్యదర్శులు బి లక్ష్మిరాజా, బి సుభాషిణి, టి అన్నారాము, ప్రచురణ విభాగ ఛైర్మన్ ఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు లేకపోతే ఎలా? : ఎస్‌టియు

బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఎలా అని ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, హెచ్ తిమ్మన్న ప్రశ్నించారు. ఈ మేరకు రాష్ట్ర ఖజానా కార్యాలయం డైరెక్టర్ ఎన్ మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 4న సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

బాధ్యతా రాహిత్యం : ఎపిటిఎఫ్

బదిలీలు జరిగి రెండు నెలలు అవుతున్నా.. ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవడం ప్రభుత్వం బాధ్యతా రాహిత్యమని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి ఒక ప్రకటనలో విమర్శించారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు రాకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మాచర్లలో పులి కలకలం


పులి పాదముద్రల కోసం పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా మాచర్ల శివారు ప్రాంతంలో చిరుత పులి సంచరించడం, ఒక పిల్లిని నోట కరుచుకొని తీసుకుపోవడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం... 7వ వార్డు శివారు అటవీ ప్రాంతం సమీపంలో కళాకారుల కాలనీ ఉంది. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ఇంటి బయట కూర్చున్న మహిళ కొద్ది దూరంలో పులి కనిపించడంతో భయంతో కేకలు వేసింది. ఇరుగుపొరుగు వారు వచ్చి వెతికినా పులి కనబడలేదు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అదే ప్రాంతంలో ఆశ అనే మహిళ... తన ఇంటి వెనుక ప్రాంతంలో పిల్లిని నోట కరుచుకొని తీసుకెళ్తున్న పులిని చూసి భయకంపితురాలయ్యారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అటవీ అధికారులు ఆ ప్రాంతంలో పులి అడుగుజాడల కోసం పరిశీలించారు. ఎటువంటి ఆనవాళ్లు లభించలేదని, కళాకారుల కాలనీలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని అటవీ శాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. పులి సంచారంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తెనాలి నుంచి నాదెండ్ల పోటీ!

- పవన్ ప్రకటనతో టిడిపిలో గుబులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తారని మంగళవారం రాత్రి జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన టిడిపిలో గుబులు రేపుతోంది. టిడిపి, జనసేన మధ్య పొత్తు ఉంటుందని ఇప్పటి వరకు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ అంశంపై ఇంకా స్పష్టత రాకుండా పవన్‌కల్యాణ్ అభ్యర్థులను ప్రకటించడం టిడిపి నేతలకు మింగుడు పడటంలేదు. తెనాలి నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తానే టిడిపి తరుపున తెనాలి నుంచి పోటీ చేస్తానని ఆలపాటి ఇటీవల ప్రకటించారు. నాదెండ్ల మనోహర్ కూడా గతంలో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా పనిచేశారు. గత ఆరేళ్ల గా జనసేనలో కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా నాదెండ్లపై తమ విశ్వాసాన్ని పలుమార్లు బహిరంగంగానే వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మంగళగిరిలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తారని ప్రకటించారు. రాష్ట్రంలో జనసేన తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాదెండ్లను ప్రకటించినట్టు అయింది. పవన్ ప్రకటనపై టిడిపి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పొత్తు వ్యవహారం ఒక కొలిక్కి రాకుండానే ఇలా ప్రకటనలు చేయడంపై పార్టీ నాయకులు మదనపడుతున్నారు.

వైద్యారోగ్యశాఖలోని ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాలు, సొసైటీల్లో సేవలందించి, ప్రస్తుతం డిఎంఇ, వైద్య విధాన పరిషత్తుల్లో కొనసాగుతున్న అన్ని కేడర్ల మొత్తం సర్వీస్ కాలాన్ని రెగ్యులరైజేషన్ కోసం పరిగణనలోకి తీసుకోవాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు కె జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు బుధవారం లేఖ రాశారు. 2014 జూన్ నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని సర్వీసులో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులు సుమారు 25 ఏళ్లుగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రెగ్యులర్ నియామకాల్లో వెయిటేజ్‌తో రెగ్యులర్ కాకుండా ఇప్పటికీ డిఎస్‌సి పారామెడికల్ ఉద్యోగులు ఉన్నారన్నారు. డిసెంబరు 2022 నాటికి పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేసే అంశాన్ని పరిశీలించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మహిళ అదృశ్యం

- వార్డు వలంటీరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

విశాఖలోని పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమయ్యారు. ఆ ప్రాంతంలోని వార్డు వలంటీరే తన భార్యను తీసుకెళ్లినట్లు ఆమె భర్త ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. రేవళ్లపాలెం గ్రామానికి చెందిన పి.వరలక్ష్మి గతంలో జివిఎంసి ఏడో వార్డు పరిధిలోని మిథిలాపురి వుడా కాలనీ సచివాలయంలో వలంటీరుగా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆమె పనిచేయడం లేదు. గత నెల 27 నుంచి ఆమె కనిపించకపోవడం లేదు. గతంలో ఆమె విధులు నిర్వర్తించిన సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న దిలీప్ అనే వ్యక్తి తీసుకెళ్లినట్లు ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం దిలీప్ కూడా కనిపించడం లేదని ఫిర్యాదుదారు తెలిపాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ కావాలి

- రాష్ట్ర ప్రభుత్వ సనాతన ధర్మ ప్రచారంపై సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాల నుండి కళాశాలస్థాయి వరకు సనాతన హిందూ ధర్మ ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి, ఆర్‌ఎస్ఎస్ అడుగుజాడల్లో విద్యను కాషాయీకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు.

ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సేవా దృక్పథం పెంచే విధంగా సిలబస్, ప్రచారం ఉండాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు అన్ని కులాలు, మతాలకు చెందిన వారుంటారని, ఇది లౌకిక రాజ్యాంగమని తెలిపారు. రాజ్యాంగ బద్ధులై ఉంటామని ప్రమాణం చేసిన రాష్ట్ర మంత్రి పాఠశాలల్లో మతప్రచారం చేస్తామని ప్రకటించడం విద్యార్థుల మధ్య చిచ్చు రేపుతుందని, సామాజిక అశాంతికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే బిజెపి, ఆర్‌ఎస్ఎస్ రాష్ట్రంలో అవకాశం దొరికిన చోట మత ఘర్షణలు రెచ్చగొట్టడాన్ని చూస్తున్నాయని, వైసిపి ప్రభుత్వం వారి ఒత్తిళ్లకు లొంగి మతోన్మాదుల పట్ల మెతగ్గా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే విద్య వాణిజ్యపరమైందని, దానికి తోడు కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా బిజెపి, ఆర్‌ఎస్ఎస్ అడుగుజాడల్లో నడవడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మత వైషమ్యాలను పెంచి సమైక్యతను దెబ్బతీస్తుందని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించాలని కోరారు.

ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలలు,కళాశాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. పాఠశాల, కళాశాలల్లో సనాతన ధర్మ బోధనను ప్రారంభిస్తామని దేవాదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 6వ తేదిన కాకినాడ జిల్లా అన్నవరం నుంచి పాఠశాలలు, కళాశాలల్లో సనాతన ధర్మప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో భిన్న మతాలు, భిన్న సంస్కృతులకు చెందిన విద్యార్థులు చదువుతూ ఉంటారని తెలిపారు. వారందరిలో శాస్త్రీయ దృక్పథాన్ని, లౌకిక వాదాన్ని పెంపొందించాలని సూచించారు. మత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్‌మీనా గెజిట్ నోటిఫికేషన్ బుధవారం విడుదల చేశారు. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్‌కుమార్ ఆదేశాల మేరకు 175 నియోజకవర్గాలకు ఆర్‌ఓలను నియమించారు. గెజిట్ నోటిఫికేషన్ జారీతో రానున్న సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్రంలో తొలి అంకం ప్రారంభమైనట్లే.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిపారు. బుధవారం పింగళి వెంకయ్య చిత్రపటానికి వైసిపి కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ.. మన రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య భారత జాతీయ పతాకాన్ని రూపొందించడం గర్వకారణమని అన్నారు.

పింగళి సేవలను భావితరాలకు తెలపాలి : పవన్

జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విద్య, శాస్త్రీయ రంగాల్లో చేసిన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత జాతీయ భావాలు కలిగిన ప్రతిఒక్కరిపై ఉందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పింగళి జయంతి సందర్భంగా ఆయనకు అంజలి ఘటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెద్దిరెడ్డి అవినీతి సిఎంకు తెలుసు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ల్యాండ్, శాండ్, మైనింగ్, కన్‌స్ట్రక్షన్, మద్యం వ్యాపారాలతో మంత్రి పెద్దిరెడ్డి పెద్దయెత్తున అవినీతికి పాల్పడుతున్నారనిటిడిపి అధికార ప్రతినిధి జివి రెడ్డి ఆరోపించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా వైసిపి నేతలే పెద్దిరెడ్డి అవినీతి గురించి మాట్లాడుతున్నారని అన్నారు. మంత్రి అవినీతి గురించి ముఖ్యమంత్రికి తెలియదనుకోవడం పిచ్చితనమే అని విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్‌కు వాటాలు ముట్టచెబుతూ సిఎంను కూడా లెక్కచేయని స్థాయిలో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మడం, తాకట్టుపెట్టడం, అప్పులు చేయడంపై జగన్‌కు ఉన్న శ్రద్ధ మంత్రులు, వైసిపి నేతల అవినీతి కట్టడిలో లేదని పేర్కొన్నారు.

'పింగళి'కి నివాళులర్పించిన టిడిపి నేతలు

జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో జరిగింది. ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సూచనలతో త్రివర్ణ పతాకాన్ని రూపొందించడంలో వెంకయ్య కృషి, కష్టం అనిర్వచనీయమని నేతలు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కోడూరు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం వడ్డు గూడెంలో ఇళ్ల ముందు పేరుకుపోయిన బురద

గూడు చూసి గుండెలవిసే

మొదటి పేజీ తరువాయి

గోడలు ఒరిగిపోయాయి



వరద పెరుగుతోందని అధికారులు చెప్పడంతో వారం రోజుల క్రితం హడావుడిగా పునరావాస కేంద్రానికి వెళ్లాం. ఇప్పుడు వచ్చి చూస్తే ఇది మా ఇల్లేనా అన్న అనుమానం కలిగేలా ఉంది. అడుగుమేర బురద పేరుకుపోయి ఉంది. గోడలు ఒరిగిపోయాయి. ఇంటిని శుభ్రం చేయడానికి రూ.10 వేలకుపైగానే ఖర్చు అవుతుంది. అంత డబ్బు లేకపోవడంతో మేమే కష్టపడి శుభ్రం చేసుకుంటున్నాం. పునరావాస కేంద్రానికి తీసుకెళ్లిన సామాన్లను వాహనంలో తిరిగి మా ఇంటికి తెచ్చుకోవడానికి రూ.4 వేలు అవుతుంది. ఇన్ని డబ్బులు మాకెక్కడివి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కోట్ల సత్యనారాయణ, వడ్డుగూడెం కాలనీ, విఆర్.పురం మండలం

నష్టపరిహారం అందించాలి



వరద ప్రభావం దాదాపు అన్ని గ్రామాలపైనా ఉంది. ఇళ్లు దెబ్బతిన్నాయి. పంటలకు నష్టం వాటిల్లింది. రామవరం పంచాయతీలోని రామవరం, సోపల్లి, అడవి వెంకన్నగూడెం జనం అంతా సహాయక కేంద్రాల్లో పది రోజులుగా చిమ్మచీకట్లో గడిపారు. వరద తగ్గడంతో ఇంటికి వచ్చి చూస్తే గుండె తరుక్కుపోయింది. కొన్ని గృహాలు పడిపోయి కనిపించాయి. పోయిన వరదల కన్నా ఈసారి వచ్చిన వరదలకు ఒండ్రు ఎక్కువగా కొట్టుకొచ్చింది. ఈ బురద తొలగించడం చాలా కష్టంతో కూడుకున్నది. ప్రభుత్వమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

- కారం లక్ష్మి, సిపిఎం ఎంపిపి, విఆర్.పురం మండలం

మత్తు పదార్థాలను నియంత్రించాలి



కడప జిల్లా బద్వేలులో మాట్లాడుతున్న రమాదేవి

- హింస లేని సమాజం కోసం చేయిచేయి కలుపుదాం
- కొనసాగిన ఐద్వా పోరుయాత్ర

ప్రజాశక్తి- యంత్రాంగం

మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, హింస లేని సమాజం కోసం చేయి చేయి కలుపుదామని ఐద్వా నేతలు అన్నారు. కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా విశాల పోరాటాలు నిర్వహించాలని, ఇందుకు యువత కలిసి రావాలని కోరారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' నెల్లూరు మీదుగా కడప జిల్లాకు, విశాఖలో ప్రారంభమైన యాత్ర కాకినాడ జిల్లా మీదుగా తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలోనికి ప్రవేశించింది. కడప జిల్లాలోని బద్వేలు, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరులో యాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడారు. మహిళల రక్షణే తమ లక్ష్యమంటూ గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నిత్యం దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలు హింసకు గురవుతున్నార న్నారు. మత్తు, మద్యం వల్లే నిత్యం మహిళలు హింసకు, దాడులకు గురవుతున్నారని, వీటిని సంపూర్ణంగా నిరోధించాలని డిమాండ్ చేశారు. అదాని, అంబానీలకు దేశ సంపదను బిజెపి దోచిపెడుతోందని విమర్శించారు. ఖనిజ సంపదను దోచుకునేందుకు మణిపూర్‌లో రిజర్వేషన్ పేరుతో కులాల మధ్య చిచ్చురేపిందని విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం, కోరుకొండ, రాజమహేంద్రవరం, కడియం మండలాల్లో నిర్వహించిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న అమానుష ఘటనలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలపై ప్రధాని ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణులతో కమిటీ వేయాలని కోరారు. సాంఘిక ఉద్యమాలకు కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఐద్వా చేస్తున్న ఈ పోరాటాలకు నేటితరం కలిసి రావాలని కోరారు. అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సభనుద్దేశించి ఐద్వా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి ఐ.పద్మ మాట్లాడారు. బిజెపి హయాంలో మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని, వేధింపులు నిరోధించేందుకు అంతరంగిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఐద్వా సభ్యులు వీధి నాటికలు, నృత్యరూపకాలతో అవగాహన కల్పించారు. ఈ యాత్రలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.పూర్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలపై నేడు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతిలోని ఆర్-5 జోన్‌లో ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేయడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇరుపక్షాల వాదనలు గతంలో పూర్తయ్యాయి. మధ్యంతర ఉత్తర్వులను న్యాయమూర్తులు డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, రవినాథ్ తిల్హరితో కూడిన ధర్మాసనం గురువారం జారీ చేయనుంది. ఆర్-5 జోన్ ఏర్పాటులో భాగంగా అమరావతి భూములను ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయిస్తూ ప్రభుత్వం జిఓ 45 జారీ చేసింది. దీనిని నిడమర్రు గ్రామస్తులు ఎ శ్రీనివాస్, కె పద్మావతి ఇతరులు హైకోర్టులో సవాల్ చేశారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన బాట

- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి
- వేతన సవరణ, రెగ్యులర్ చేయాలని డిమాండ్



కర్నూలులో కార్మిక కర్షక భవనం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-యంత్రాంగం

45 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జెఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని, ఎన్నికల ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ఆందోళన బాటపట్టారు. పలుచోట్ల ర్యాలీలు, రిలే దీక్షలు చేపట్టారు. ఎపి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇపిఎఫ్ అమలు అవుతున్న విద్యుత్ ఉద్యోగులందరినీ జిపిఎఫ్‌లోకి మార్చాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, పీస్ రేటు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పెద్దఎత్తున నినదించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం విటిపిఎస్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రమాదాల్లో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలతో పాటు బేసిక్ అమలు చేయాలని కోరారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే 10వ తేదీ నుండి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు ఏసోబ్ మాట్లాడుతూ కార్మికులు చేస్తోన్న న్యాయమైన పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని దాసన్న పేట విద్యుత్ భవనం వద్ద రిలే నిరాహారదీక్షలను విద్యుత్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ డి.రాజేంద్రప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కర్నూలులో కార్మిక కర్షక భవన్ నుండి విద్యుత్ భవనం వరకు ప్రదర్శన, ధర్నా చేశారు. విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో విద్యుత్ సౌధ ఎదుట నిరవధిక దీక్షలను ప్రారంభించారు. అనంతపురం జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీని ఏర్పాటు చేసి ఆ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరులోని బిఆర్ స్టేడియం నుండి విద్యుత్ భవన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు. కర్నూలులో కార్మిక కర్షక భవన్ నుండి విద్యుత్ భవనం వరకు ప్రదర్శన, ధర్నా చేశారు. విద్యుత్ సౌధ ఎదుట నిరవధిక దీక్షలను ప్రారంభించారు. శ్రీకాకుళం, ఏలూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

పేదలకు విద్యను దూరం చేస్తున్నారు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి- గంట్యాడ, గజపతినగరం



సైకిల్‌యాత్రలో ప్రసన్న, జిల్లా నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ విమర్శించారు. జిల్లాలో విద్యా రంగం అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యాన చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర మూడోరోజు విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలోని శ్రీనిధి కళాశాల వద్ద ప్రసన్నకుమార్ ప్రారంభిం చారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు సోమేష్ అధ్యక్షతన లక్కిడాం జంక్షన్‌లో జరిగిన సభలో ప్రసననకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అత్యుత్సాహంతో అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తోందని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ డిగ్రీలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ విధానాన్ని విద్యార్థుల స్థాయికి, సిలబస్‌కు అనుగుణంగా పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సమీరా మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె రవికుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ అనసూయమ్మ, సిఐటియు నాయకులు వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం సైకిల్‌యాత్ర బృందం నాయకులు స్థానిక జెడ్‌పి హైస్కూలును, బుడతనాపల్లి హైస్కూలును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీరికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయిక్ స్వాగతం పలికారు. సైకిల్‌యాత్ర బొండపల్లి మండలం మీదుగా గజపతినగరం చేరుకుంది.

రుణాల్లో ఆదా చేస్తున్నారా?

- ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులపై కేంద్ర ఆర్థికశాఖ లేఖలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పలు ప్రాజెక్టుల కోసం తీసుకుంటున్న రుణాలను రాష్ట్రాలు పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తున్నాయా లేదా అన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మొత్తాలను రాష్ట్రాలు ఇతర పథకాల కోసం మళ్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రుణాల వినియోగంపై ఆరా తీస్తూ కేంద్ర ఆర్థికశాఖ రాష్ట్రాలకు లేఖలు రాసింది. ఈ లేఖల్లో వివిధ రాష్ట్రాలకు సంబంధించి 50 ప్రాజెక్టులను కేంద్ర ఆర్థికశాఖ ప్రస్తావించగా, వాటిలో రాష్ట్రానికి చెందిన విశాఖ -చెన్నై పారిశ్రామిక కారిడార్ కూడా ఉంది. దీంతో ఈ విషయం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2021వ సంవత్సరం నుండి తాము ఈ ప్రాజెక్టుల రుణాలపై వివరాలు కోరుతున్నామని, అయినా రాష్ట్రాలు స్పందించడం లేదని ఈ లేఖల్లో కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులతో రుణాలు వస్తున్న సంగతి తెలిసిందే.

ఈ రుణ నిధులను బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉంచడం వల్ల కొంత ఆదా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో కొన్ని రాష్ట్రాలు తమ వాటా నిధులు భరించలేక రుణాలను రద్దు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. అయితే తమకు ఈ వివరాలు సమర్పించడం లేదన్నది కేంద్ర ఆర్థికశాఖ వాదనగా ఉంది. అందుకే రుణాలను ఖాతాల్లో నిల్వ చేయడం వల్ల ఎంత నిధులు ఆదా అయ్యాయన్నది చెప్పాలని కేంద్రం డిమాండ్ చేస్తోంది. గతంలో ఇలా ఆదా అయిన నిధులను కేంద్రానికి సమర్పించాలని కూడా లేఖలు వచ్చాయి. అయితే, ఈ దిశలో రాష్ట్రాల స్పందన నామమాత్రమని సమాచారం.

నేటి మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - యంత్రాంగం

మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలంటూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో బుధవారం ప్రచారం ఊపందుకుంది. అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం, దండకారణ్య విమోచన సమితి ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడారు. బిజెపి ప్రోద్బలంతోనే మణిపూర్ హింసాకాండ పెచ్చుమీరిందన్నారు. బంద్ జయప్రదం కోసం ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నేతలు పాడేరు, అనంతగిరి, బొర్రా గుహలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు.

అధికారులను బెదిరించిన మాజీ మంత్రి నారాయణ

- హైకోర్టులో ప్రభుత్వం వాదన

ప్రజాశక్తి-అమరావతి

నిరుపేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇస్తే అసైనీలను గత ప్రభుత్వంలోని మున్సిపల్ మంత్రి పి నారాయణ బెదిరించారని ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. బెదిరించి కారుచౌకగా బినామీలు, బంధువుల పేర్ల మీద భూములు వచ్చేలా నారాయణ చేశారని, అధికారులను కూడా బెదిరించారని ప్రభుత్వం తరపున అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఆ విధంగా 148 ఎకరాలను కొనుగోలు చేశారని, ఇందుకోసం రూ.18.10 కోట్లు వెచ్చించారని, ఆ భూముల విలువ రూ.600 కోట్లని అన్నారు.

రాజధాని కోసం అసైన్డ్ భూముల బదలాయింపులో అక్రమాలు జరిగాయని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి మాజీ సిఎం చంద్రబాబు, నారాయణపై కేసు నమోదు చేసింది. వీటిని కొట్టేయాలంటూ వారిద్దరూ వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలను న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ ఎదుట సిఐడి తరపున అదనపు ఎజి వాదించారు. విచారణ గురువారం కొనసాగనుంది.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొర్నెపాడుకి చెందిన ఈగ జనార్ధనరావు (42) ఏడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి వేశారు. సాగు నిమిత్తం రూ. ఏడు లక్షలు అప్పు చేశారు. పంటలు సరిగ్గా పండకపోవడం, రుణదాతల ఒత్తిడితో మనస్తాపానికి గురైన జనార్ధనరావు పురుగు మందు తాగి ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య సరస్వతి, కుమార్తె నాగలక్ష్మి, కుమారుడు చరణ్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎపిఎటి ఉద్యోగుల రిలీవ్‌కు లైన్ క్లియర్

హైకోర్టులో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఎపిఎటి (ఎపి పరిపాలన ట్రిబ్యునల్) ఉద్యోగులను రిలీవ్ చేసేందుకు హైకోర్టు అనుమతిచ్చింది. తిరిగి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేశాక ఆయా శాఖల్లో చేరేందుకు వారికి అనుమతిస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎపిఎటి రద్దు తర్వాత అందులోని ఉద్యోగులు డిప్యూటేషన్‌పై హైకోర్టులో పనిచేస్తున్నారు. వీరిని ప్రభుత్వ శాఖల్లోకి బదిలీకి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ న్యాయవాది జి లక్ష్మీనారాయణ దాఖలు చేసిన పిల్‌పై ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది.

'రాజధాని ప్రాంతం' నిర్వచనాన్ని తొలగించాలి

- ఉద్యోగుల కేటాయింపునకు 'ఆప్షన్' ఇవ్వాలి
- ఎపి జెఎసి అమరావతి సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రక్షణగా ఉన్న 'ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి సలహాలు, సూచనలు చేయాలని ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలను కోరిన సంగతి పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు నేతృత్వంలోని బృందం బుధవారం కొన్ని సూచనలను సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) అదనపు కార్యదర్శి ఎన్ శ్రీనివాసులుకు లిఖిత పూర్వకంగా అందజేశారు. ప్రధానంగా రాజధాని ప్రాంతంలో ఉన్న రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు ప్రెసిడెన్సియల్ ఉత్తర్వులు వర్తించవని, 'రాజధాని ప్రాంతం' అనే నిర్వచనాన్ని తొలగించాలని సూచించారు.

జోనల్ స్థాయిలో ఫస్ట్ లెవల్ గెజిట్ వరకు కంటే చిన్నచిన్న కేడర్ వాళ్లు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు జోనల్ స్థాయిలో సెకెండ్ లెవెల్ గెజిట్ వరకు, అదే విధంగా మల్టీజోన్ స్థాయిలో సెకెండ్ లెవెల్ గెజిటెడ్ కన్నా పైస్థాయి కేడర్ వాళ్లను ఉంచాలని సూచించారు. కొత్త, పాత జిల్లాల మధ్య ఉద్యోగులను శాశ్వతంగా కేటాయించే సమయంలో ముందుగా ఉద్యోగుల నుంచి 'ఆప్షన్' తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో (సచివాలయం, శాఖాధిపతులు, పోలీస్ కమిషనరేట్, రాష్ట్ర కార్యాలయాలు) పనిచేసే ఉద్యోగులు శిక్షణ కోసం వస్తే ఇబ్బంది లేదని, జిల్లా స్థాయి పోస్టులకు శాశ్వత ప్రాతిపదికన వస్తే, జిల్లా స్థాయిలో ఉన్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఎపి జెఎసి అమరావతి పేర్కొంది. జిల్లా స్థాయి ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి సచివాలయంలో పనిచేసే అవకాశం లేనప్పుడు వారు శాశ్వతంగా వచ్చేందుకు ఒప్పుకోవడం లేదని తెలిపింది. 1 నుంచి 7వ తరగతికి బదులు 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉంటే స్థానికత నిర్ధారణ చేయాలని పేర్కొంది.

రేషన్ కార్డుంటేనే వరద సాయం!

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

గ్రామాలను గోదావరి వరద చుట్టుముట్టడంతో పునరావాస కేంద్రాలకు చేరిన బాధితులను నిబంధనల పేరుతో అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే బియ్యం, వంట నూనె ప్యాకెట్, కందిపప్పు వంటివి అందిస్తున్నారు. దీంతో, కట్టుబట్టలతో పునరావాస కాలనీలకు చేరిన వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీళ్ల చారుతో అధికారులు పెట్టే భోజనం తినలేక, వండుకునేందుకు సరుకులు లేక అర్థాకలితో అలమటిస్తున్నారు. గోదావరి వరద ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 45 నివాసిత ప్రాంతాలను చుట్టుముట్టింది. 13,764 మంది వరద బాధితులుగా మారారు. ఈ రెండు మండలాల్లో 12 పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 4,235 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నేటికీ అనేక మంది కొండలు, గుట్టలపైకి వెళ్లి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

వేలేరుపాడు మండలం సుద్దగుంప గ్రామంలో దాదాపు 36 కుటుంబాలు ఉన్నాయి. వరద నీరు ఈ గ్రామాన్ని చుట్టుముట్టడంతో గ్రామస్తులను బండ్లబోరు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీకి తరలించారు. ఇక్కడ ఎటువంటి సదుపాయాలూ లేవు. టార్పాలిన్లతో గుడారాలు వేసుకుని ఒక్కో గుడారంలో ఐదారు కుటుంబాలు ఉంటున్నాయి. కనీసం టార్పాలిన్లు కూడా ఇవ్వకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ గ్రామస్తులు పలువురికి రేషన్ కార్డులు లేవు. దీంతో, ప్రభుత్వం వరద బాధితులకు అందించే రెండు నెలలకు సరిపడా బియ్యం, వంట నూనె ప్యాకెట్, కందిపప్పు వంటివి వీరికి ఇవ్వడం లేదు. ఈ గ్రామస్తులకే కాదు రేషన్ కార్డులేదన్న సాకుతో ఈ రెండు మండలాల్లోని పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులకుగానీ, కొండలు, గుట్టలపై ఉన్న బాధితులకుగానీ ప్రభుత్వం సాయం అందించడం లేదు. రేషన్ కార్డులేని వారు వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. సుద్దగుంప గ్రామస్తులకు ప్రతిరోజూ ట్రాక్టర్‌పై భోజనం తెచ్చి పెడుతున్నారు. ఏదో ఒకకూర, నీళ్లచారుతో భోజనం పెడుతుండడంతో తినలేకపోతున్నామని వరద బాధితులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులకు, చిన్నపిల్లలకు అరుగుదల సమస్య వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట చేసుకుని తిందామంటే రేషన్ కార్డులు లేని కుటుంబాలకు సరుకులు ఇవ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అందరికీ సాయం అందించాలని వరద బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

పునరావాస కేంద్రానికి వెళ్లలేదని అందని వరద సాయం

వేలేరుపాడు మండలంలోని తాట్కూరు గొమ్ము కాలనీ గ్రామానికి చేరువగా వరద నీరు చేరింది. పునరావాస కేంద్రాలకు వెళ్లలేదనే కారణంతో ఇక్కడి వారికి అధికారులు వరద సాయం అందించలేదు. పనులు వెళ్లేందుకు 15 రోజులుగా అవకాశం లేకుండా పోవడంతో చేతిలో డబ్బులు లేక ఈ గ్రామంలోని 70కిపైగా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

సంపాదకీయం

మరో ఘోరం

నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి పాలనలో దేశంలో ఘోరాలకు, దారుణాలకు అంతులేకుండా పోతోంది. ఒక చోట జరిగిన అమానుషాన్ని మరచిపోకముందే మరో చోట ముష్కరమూకలు చెలరేగుతుంటాయి. విద్వేషాగ్నులు చిందిస్తూ మారణహోమాన్ని సృష్టిస్తుంటాయి. హర్యానాలో ఇప్పుడు జరుగుతున్నదదే! మణిపూర్‌లో భయానక హింసాకాండకు పాల్పడ్డ విద్వేష శక్తులు తమ నెత్తుటి దాహం తీర్చుకోవడానికి ఈ సారి హర్యానా లోని నుహ్ ప్రాంతంలో తొలుత విరుచుకుపడ్డాయి. ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ, ఒక ఇమామ్‌తో సహా ఆరుగురిని బలిగొన్నాయి. ఒక మతానికి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని ఆ శక్తులు సృష్టించిన హింసాకాండలో 70 మంది అమాయకులు గాయాలపాలైనారు. ఆస్తి నష్టమూ భారీగానే జరిగింది. ఏ క్షణంలో ఏమైనా జరగవచ్చున్న భయాందోళనలు స్థానిక ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి. నిజానికి మణిపూర్‌లో రోజుకొకటిగా వెలుగులోకి వస్తున్న అంతులేని అమానుషత్వం దేశ ప్రజలను ఇంకా కలవరపరుస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా దేశాన్ని బోనులో నిలబెట్టిన ఈ దారుణంపై పార్లమెంటులో దేశ ప్రజలకు జవాబు చెప్పడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిరాకరించడంతో ప్రతిపక్ష ఇండియా కూటమికి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం మినహా మరో గత్యంతరం లేని స్థితి! ఆ అవిశ్వాస తీర్మానం కూడా ఇంకా చర్చకు రాలేదు. అంతలోనే హర్యానాలో మత చిచ్చు రేపడం సంఘ్‌పరివార్ మూకల బరితెగింపునకు నిదర్శనం!

2011 జనాభా లెక్కల ప్రకారం హర్యానా లోని నుహ్ జనాభా 10,767 మాత్రమే! హిందూ, ముస్లింల సామరస్య పూర్వక జీవనానికి ఈ చిన్న పట్టణం శతాబ్దాల చరిత్ర కలిగి ఉంది. ఇటువంటి ప్రశాంతత, సామరస్య జీవనం మతోన్మాదులకు సహజంగానే నచ్చవు గదా! అందులోనూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా ఒక పథకం ప్రకారం సంఘ్‌పరివార్ శక్తులు బరిలోకి దిగాయి. సాంప్రదాయంగా జరిగే బ్రజ్ మండల్ యాత్రను దీనికి అవకాశంగా తీసుకున్నాయి. శ్రీకృష్ణుడికి సంబంధించి కాలినడకన ఒకటి, రెండు నెలలు సాగే ఈ తీర్థయాత్రకు స్థానిక ముస్లింలు సైతం సహకారాన్ని అందచేస్తారు. ఎవరి జోక్యం లేకుండా ప్రశాంతంగా సాగే ఆ యాత్రను సంఘ్‌పరివార్ మూకలు ఈ సారి విద్వేష విషం చిమ్మడానికి వేదికగా చేసుకున్నాయి. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ వంటి సంస్థలు సోషల్‌మీడియాను ముస్లిం వ్యతిరేక ప్రచారంతో నింపేశాయి. గో గూండాల చేతిలో హత్యకు గురైన నాసిర్, జునాయిడ్‌లు గుర్తున్నారు కదా! ఆ హత్యలతో ప్రత్యక్ష సంబంధముందని ఆరోపణలు ఎదుర్కొంటున్న మోను మనేసర్ బాహాటంగానే ఈ ప్రచారంలో భాగమయ్యాడు. ఈ పరిణామాలపై నుహ్ ప్రజానీకం ఎప్పటికప్పుడు పోలీసుల, రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. రక్షణ కల్పించాలని కోరారు. ఈ విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోకుండా యాత్రకు అనుమతించింది. దీంతో ఉద్రిక్తత రాజుకుంది. సోషల్‌మీడియాలో విషప్రచారం జరిగినన్ని రోజులు కళ్లు మూసుకున్న ప్రభుత్వం నుహ్‌లో దాడులు ప్రారంభం కాగానే ఇంటర్‌నెట్‌ను నిలిపివేసింది. దీంతో ఇతర ప్రాంతాల్లోని ప్రజానీకం అప్రమత్తం కావడానికి అవకాశం లేకుండా పోయింది. అదే సమయంలో అల్లరిమూకలు దాడులను విస్తరించాయి. ఇంత జరిగిన తరువాత కూడా ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి విహెచ్‌పి, బజరంగ్‌దళ్‌లతో పాటు, హత్యారోపణలను ఎదుర్కొంటున్న మోను మనేసర్‌ను సైతం వెనకేసుకొచ్చారు. ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కుట్ర సిద్ధాంతాన్ని బయటకు తీశారు. విహెచ్‌పి, బజరంగ్‌దళ్‌తో పాటు ఇతర ఆర్‌ఎస్‌ఎస్ కుదురు సంస్థలు ఢిల్లీలో ధర్నా చేసి ఎన్‌ఐఎ విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశాయి. దొంగే.. దొంగా, దొంగా అని అరవడమంటే ఇదే కదా!

మరోసారి అందలం ఎక్కడానికి ప్రజలను చీల్చే విష వ్యూహాలకు మతోన్మాద శక్తులు నిస్సిగ్గుగా దిగుతున్నాయి. మణిపూర్, హర్యానా సంఘటనలతో డబుల్ ఇంజన్ శక్తి ఎవరికి ఉపయోగపడుతోందో, ఎవరికి అండగా నిలుస్తోందో తేలిపోయింది. ఎన్నికలు ముంచుకొస్తుండటంతో ఇతర రాష్ట్రాలకూ ఈ తరహా ముప్పు పొంచే ఉంది. అందుకే, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు మతోన్మాద పార్టీలను ఓడించేందుకు ఐక్యంగా కదలాలి. వరుస మారణహోమాలను చూసిన తరువాతైనా బిజెపికి మద్దతిస్తున్న వైసిపి, టిడిపి, బిజెడి వంటి ప్రాంతీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకోవాలి. ఆచరణలో ప్రజలకు అండగా నిలవాలి. ప్రజానీకం సైతం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి. మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలి.

మహనీయుల మాట



స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కంటే
ఏదీ అమూల్యమైనది కాదు.
- హోచిమిన్



ఆవు పేడ కాదు... కావాల్సింది సెమీ కండక్టర్ల పరిశోధన !

లేఖ



కుహనా అంశాలమీద పరిశోధనకు మీరు చూపుతున్న శ్రద్ధ సెమీకండక్టర్ల వంటి ప్రాధాన్య రంగాల మీద లేదు. ఆవు పేడ, మూత్రం, పాలలో బంగారం ఉందా, ఇంకా ఏమైనా ఉన్నాయా అంటూ పరిశోధనలకు ప్రజాధనాన్ని ప్రభుత్వం వృధా చేస్తున్నదని ...2020 సంవత్సరంలో వందలాది మంది శాస్త్రవేత్తలు... ప్రభుత్వ తీరుతెన్నులను తప్పు పడుతూ ఆ పరిశోధనలను ఆపివేయాలని కోరినా మీరు పట్టించుకోలేదు. అంతకు ముందు 2017లో పంచగవ్య గురించి ఆయుర్వేద పుస్తకాల్లో రాసిన వాటిని రుజువు చేసేందుకుగాను పరిశోధనలు చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. మొత్తంగా పరిశోధనలకు తగినన్ని నిధులు కేటాయించకుండా ముందుకు పోవటానికి మీ దగ్గర మంత్రదండమేదైనా ఉంటే హాం ఫట్ అంటూ తిప్పండి.

ప్రధాని నరేంద్ర మోడీ గారికి,

అయ్యా! ప్రతి నెలా మీ మన్ కీ బాత్ అంశాలను చదివే వారిలో నేనూ ఒకరిని. ఒక జర్నలిస్టుగా జన్‌కీ బాత్‌లో ఉన్న కొన్నింటిని ఈ బహిరంగ లేఖ ద్వారా మీ ముందుకు తీసుకు వస్తున్నాను. జులై 28-30 తేదీలలో గుజరాత్ రాష్ట్ర రాజధాని గాంధీనగర్ లోని మహాత్మా మందిర్‌లో తమరు సెమికాన్ ఇండియా 2023 రెండవ వార్షిక సమావేశాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా దేశమంతటా పత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనలు కూడా జారీ చేశారు. దేశాన్ని సెమీకండక్టర్ల కేంద్రంగా మార్చుతామని, మూడు వందల కాలేజీల్లో సెమీకండక్టర్ కోర్సులను ప్రవేశపెడతామని తమరు ప్రకటించటం సంతోషం. గతంలో దేశంలో జరిగిన అనర్థాలకు, దేశం వెనుకబడి ఉండటానికి, మనకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం రాకపోవటానికి నెహ్రూనే కారణం అని బిజెపి, దాని మాతృసంస్థ సంఘ పరివారం తకీమని సమాధానం చెబుతుంది. సెమీకండక్టర్ల రంగంలో వెనుకబడటానికి కూడా నెహ్రూనే నిందిస్తారా?

ఎయిర్‌బస్‌లో అనేక దేశాలను అలా వెళ్లి ఇలా చుట్టివచ్చిన మీరు సెమీకండక్టర్ బస్‌ను ఎలా మిస్ అయ్యారన్నది చాలా మందికి అర్థం కావటం లేదు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తరువాత వచ్చిన ప్రధానులెవరికీ (వారిలో అటల్ బిహారీ వాజ్‌పేయి ఉన్నదీ లేనిదీ తెలియదు) దూరదృష్టి లేదని విమర్శించే మీ అనుయాయులు (సుబ్రమణ్య స్వామిని పక్కన పెడదాం) మీ గురించి ఏం చెబుతారో తెలియదు. ఎందుకంటే కాంగ్రెస్ యాభై సంవత్సరాలలో చేసిన దాన్ని మీరు తొలి ఐదు సంవత్సరాల్లోనే చేసి చూపించారని గత ఎన్నికలపుడు ప్రచారం చేశారు. చేసిందేమిటో సాధికారిక సమాచారాన్ని జనానికి అందిస్తే వాస్తవం తెలుస్తుంది. మన దేశంలో మీ కంటే ముందు నుంచి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్) పేరుతో వివరాలను సేకరిస్తున్నారు. దానిలో మీ పాలనలో అనేక సూచికలు దిగజారినట్లు కనిపించింది. మీ ఏలుబడిలో నిరుద్యోగం పెరిగిందన్న సమాచారాన్ని గత లోక్‌సభ ఎన్నికల ముందు తొక్కిపెట్టిన సంగతి మీకు చెప్పనవసరం లేదు. వచ్చే సర్వేలో ఎలాంటి ఫలితాలు వస్తాయోనని సమాచారాన్ని సేకరించే పద్ధతిని రూపొందించే సంస్థ అధిపతినే తప్పించారని జనం అనుకుంటున్నారు.



ఎం. కోటేశ్వరరావు

నరేంద్ర మోడీ పెద్ద విజనరీ అంటే భూత, వర్తమాన, భవిష్యత్‌ను చూడగలిగిన దృష్టి కలవారని ప్రచారం చేశారు. నిజమే కావచ్చు, సర్వేల్లో వచ్చే సమాచారం ఎలాంటిదో మీకు ముందే తెలిసి ఉంటుంది గనుక దాని రూపకర్తనే తొలగించారు. అన్నట్లు మరిచాను. ఈ ఏడాది మీ మీద ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతాయని మీరు ముందే గ్రహించి ఆ విషయాన్ని ఎన్నో సంవత్సరాల ముందే మీరు చెప్పినట్లు కొందరు సామాజిక మాధ్యమంలో మీ గొప్ప గురించి ప్రచారం చేస్తున్న పోస్టు ఉంది. దాని నిజానిజాలు మీకే ఎరుక. నిజంగా మీకు తెలిసి ఉంటే మణిపూర్ దురంతాన్ని ఎందుకు నివారించ లేకపోయారు అన్న ప్రశ్న వస్తోంది. దాన్ని వదలివేద్దాం. నాలుగవ తరం పారిశ్రామిక విప్లవం గురించి కూడా మీరు చెప్పారు. పిండి లేకుండా రొట్టెలు రావు కదా? దానికి అవసరమైన పరిశోధన, అభివృద్ధి రంగాల ప్రాధాన్యత, దానిలో సెమీకండక్టర్ల గురించి ప్రధాని కాగానే లేదా అంతకు ముందు గుజరాత్ సి.ఎం గా ఎందుకు పసిగట్టలేకపోయినట్లు? ఈ రంగానికి నిధుల కేటాయింపు కేంద్ర ప్రభుత్వం లేదా ప్రైవేటు సంస్థలు చేయాల్సి ఉంది. రెండూ జరగటం లేదు. ముంబై కేంద్రంగా పని చేస్తున్న గేట్‌వే హౌస్ అనే ఒక మేథో సంస్థ 2015 జనవరి పదహారున టెక్నాలజీ పరుగులో చైనా ముందు భారత్ ఓడిపోనుందా అనే శీర్షికతో ఒక విశ్లేషణను ప్రచురించింది. మీ సలహాదారులకు దీని గురించి తెలియదని అనుకోలేము. లేదా ఇలాంటి వాటిని పట్టించుకోకపోతే మన దేశ ఖర్మ అనుకోవటం తప్ప చేసేదేమీ లేదు. దానిలో పరిశోధన, అభివృద్ధి ఖర్చు గురించి చర్చించారు. 1991 నుంచి చైనా పరిశోధన ఖర్చును ఏటా 19 శాతం పెంచుతూ 2012 నాటికి జిడిపిలో 1.97 శాతానికి చేరినట్లు పేర్కొన్నారు. అప్పటికి మన దేశ ఖర్చు 0.9 శాతం మాత్రమే ఉంది. ఫస్ట్ పోస్ట్ అనే పత్రికలో 2023 ఫిబ్రవరి ఒకటిన ప్రచురితమైన ఒక విశ్లేషణలో జిడిపిలో మన దేశ తాజా ఖర్చు 0.7 శాతమే అని చైనా 2.1 శాతంగా పేర్కొన్నారు. జిడిపిలో రెండు శాతం ఖర్చు చేయాలని గతంలో వాజ్‌పేయి సర్కార్ కూడా చెప్పింది. దూరదృష్టి గల మీ పాలనలో గతం కంటే తగ్గిందేమిటి? మన దేశంలో నిపుణులకు, పరిశోధకులకు కొరత ఉన్నదా ?

కుహనా అంశాలమీద పరిశోధనకు మీరు చూపుతున్న శ్రద్ధ సెమీకండక్టర్ల వంటి ప్రాధాన్య రంగాల మీద లేదు. ఆవు పేడ, మూత్రం, పాలలో బంగారం ఉందా, ఇంకా ఏమైనా ఉన్నాయా అంటూ పరిశోధనలకు ప్రజాధనాన్ని ప్రభుత్వం వృధా చేస్తున్నదని 2020 సంవత్సరంలో వందలాది మంది శాస్త్రవేత్తలు ప్రభుత్వ తీరుతెన్నులను తప్పు పడుతూ ఆ పరిశోధనలను ఆపివేయాలని కోరినా మీరు పట్టించుకోలేదు. అంతకు ముందు 2017లో పంచగవ్య గురించి ఆయుర్వేద పుస్తకాల్లో రాసిన వాటిని రుజువు చేసేందుకు పరిశోధనలు చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. మొత్తంగా పరిశోధనలకు తగినన్ని నిధులు కేటాయించకుండా ముందుకు పోవటానికి మీ దగ్గర మంత్రదండమేదైనా ఉంటే హాం ఫట్ అంటూ తిప్పండి. ప్రతి లక్ష మంది జనాభాకు ఇజ్రాయెల్‌లో 834, దక్షిణ కొరియా 749, అమెరికాలో 441, చైనాలో 130 మంది పరిశోధకులు ఉండగా మన దేశంలో కేవలం 25 మంది మాత్రమే ఉన్నారని చెప్పటం మీకు ఇష్టముండదని తెలిసినా తప్పటం లేదు.

తినేందుకు బంగాళాదుంప, అరటి చిప్స్ లేకున్నా రోజు గడుస్తుందిగానీ ఎలక్ట్రానిక్స్ చిప్స్ లేకుండా మనకు క్షణం గడవదంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో నిపుణులైన సెమీకండక్టర్ రూపకల్పన ఇంజనీర్లు ప్రపంచం మొత్తంలో ఉన్నవారిలో 20 శాతం మంది మన దేశంలో ఉన్నారని అంచనా. వారందరినీ విదేశీ కంపెనీలకు చౌక శ్రామికులుగా సమర్పించటం తప్ప ఇప్పుడు జరుగుతున్నదేమైనా ఉందా? వారు సాధించే పేటెంట్లు మన దేశానికి దక్కవు. మన ఇంజనీర్లు ఐటి రంగంలో ముందున్నారు. దీనికి మీ సర్కార్ ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. హార్డ్‌వేర్ రంగంలో ఆ స్థితి లేదు. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువ భాగం మనం దిగుమతి చేసుకుంటున్నాం. అదే విధంగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలతో విదేశీ కంపెనీలు రూపకల్పనలో లబ్ధి పొందటం తప్ప చిప్స్ తయారీ మన దేశంలో ఎంతమేరకు జరుగుతుందన్నది ప్రశ్నార్థకమే. ప్రస్తుతం అమెరికా మైక్రాన్ కంపెనీ ఎక్కడో ఉత్పత్తి చేసిన వాటిని మన దేశంలో పరీక్షించి ప్యాకింగ్ చేయిస్తున్నది. దానితోనే పండగ చేసుకుందామా ?

గత పది సంవత్సరాలుగా ఈ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీనికి కూడా నెహ్రూ, కాంగ్రెసే కారణం అని మీ మద్దతుదార్లు చెప్పినా ఆశ్చర్యంలేదు. అమెరికా వాణిజ్య మంత్రి గినా రైమండోతో మన మంత్రి పియూష్ గోయల్ 2023 మార్చి పదవ తేదీన సెమీకండక్టర్ల సరఫరా, నూతన ఆవిష్కరణల భాగస్వామ్యం గురించి ఒక ఒప్పందం చేసుకున్నారు. అంతకు ముందు జనవరిలో సంక్లిష్టమైన, వర్ధమాన సాంకేతికతల (ఐసిఇటి) సహకారం గురించి ఒప్పందం జరిగింది. చిత్రం ఏమంటే అధ్యక్ష కార్యాలయం వెల్లడించిన వాస్తవాల పత్రంలో మిగతా అంశాల గురించి ఉంది తప్ప సెమీకండక్టర్ల మీద నిర్దిష్టంగా ఏమీ లేదు అని కార్నెగీ ఇండియా వెబ్‌సైట్‌లో 2023 మే నెల 23వ తేదీన కోణార్క భండారీ రాశారు. మన దగ్గర దానికి భిన్నమైన సమాచారం ఉంటే ఆ పత్రాన్ని విడుదల చేస్తే వాస్తవం తెలుస్తుంది. మనదేశంలో ఉత్పత్తి చేసి ఎగుమతి చేసే వాటిని ప్రోత్సహించేందుకు ఉత్పాదకతతో ముడివడిన ప్రోత్సాహక (పిఎల్‌ఐ) పథకాన్ని 2021 నుంచి ఐదేళ్లలో రూ.1.97 లక్షల కోట్లు ఇచ్చే ప్రవేశపెట్టారు. కానీ దాన్ని ఆచరణలో ఉత్పత్తి బదులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న విడిభాగాలను ఒక దగ్గర చేర్చే సెల్‌ఫోన్లకు, చిప్స్ పరీక్షలకు ఇస్తున్నారు. అందుకే భలే మంచి పథకం, వదలితే దొరకదని పోలోమంటూ ఆపిల్, మైక్రాన్ వంటి కంపెనీలు మన దేశానికి వస్తున్నాయి.

రెండు దిగ్గజ దేశాలైన అమెరికా, చైనా సెమీకండక్టర్ల రంగంలో పైచేయి సాధించేందుకు భారీ సబ్సిడీలతో పోటీ పడుతున్నాయి. అదే సమయంలో చైనా తన స్వంత రూపకల్పన, ఉత్పత్తికి గాను భారీ మొత్తంలో పరిశోధనకు నిధులు వెచ్చిస్తున్నది. మన దేశంలో ఒక సమగ్ర విధానాన్ని కూడా ఇప్పటికీ రూపొందించుకోలేకపోయాము. ఆలూ లేదూ చూలూ లేదు అన్నట్లుగా ఉంటే మన దేశాన్ని సెమీకండక్టర్ హబ్‌గా మారుస్తానని మీరు చెబుతున్నారు. వరల్డ్ పాపులేషన్ రివ్యూ తాజా (2023) సమాచారం ప్రకారం సెమీకండక్టర్ల ఉత్పత్తిలో తైవాన్, దక్షిణ కొరియా, జపాన్, చైనా, అమెరికా తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఫ్యాబ్రికేషన్‌లో 2022 డిసెంబరు నాటికి జపాన్‌లో 102, తైవాన్ 77, అమెరికా 76, చైనా 70, జర్మనీ 20, బ్రిటన్ 12, మలేషియా 7 ప్లాంట్లను కలిగి ఉన్నాయి. తరువాత స్థానాల్లో ఇజ్రాయెల్, నెదర్లాండ్స్ ఉన్నాయి. గుజరాత్‌లో 70 శాతం సబ్సిడీ ఇచ్చి అమెరికా మైక్రాన్ కంపెనీతో ఒక పాకింగ్ కేంద్రాన్ని పెట్టించి దీంతో ప్రపంచ హబ్‌గా మారుస్తానని మీరు జనాలకు చెబుతున్నారు. ఇది ఎంతకాలం నడుస్తుంది? అమెరికా మనలను తన సహజ భాగస్వామిగా పరిగణిస్తున్నదని, పిలిచి పెద్ద పీటవేస్తున్నదని చెబుతున్నారు. గతేడాది (2022) మార్చి నెలలో తొలిసారిగా అమెరికా చొరవతో చిప్స్ 4 లేదా ఫాబ్ 4 కూటమి ఏర్పడింది. దానిలో తైవాన్, జపాన్, దక్షిణ కొరియా ఇతర భాగస్వాములు తప్ప మనకు చోటు లేదు. ప్రపంచ సెమీకండక్టర్ల పరిశ్రమలో 70 శాతం వాటా ఈ నాలుగు దేశాలదే. విధాన రూపకల్పన, ఉత్పత్తిలో పరస్పరం సహకరించుకొనేందుకు, విస్తరణకు దీన్ని ఏర్పాటు చేశారు.

గత తొమ్మిది సంవత్సరాల్లో దేశ అప్పును విపరీతంగా పెంచివేశారు. కాగ్ ఖరారు చేసిన గణాంకాల ప్రకారం 2014 మార్చి 31 నాటికి కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.50,68,235 కోట్లు. కాగా 2015 మార్చి నాటికి అంటే తొలి ఏడాది దాన్ని రూ.56,07,315 కోట్లకు తరువాత మీరు దాన్ని ఎడాపెడా పెంచారు. కేవలం మీరు చేసిన అప్పు 2024 మార్చి నాటికి రూ.118,78,431 కోట్లకు పెంచుతామని ప్రతిపాదించారు. మీరు అధికారానికి వచ్చినపుడు కేంద్ర ప్రభుత్వ రుణం జిడిపిలో 67.1 శాతం కాగా 2021లో 88.5 శాతానికి పెరిగింది, 2023 నాటికి అది 83.1 శాతంగా ఉంది. ఇంత చేసిన వారు పరిశోధనకు పెంచకపోగా ఎందుకు తగ్గించిందీ ఏదైనా ఒక మన్‌కీ బాత్‌లో చెబితే సంతోషం. ఆవు పేడ పరిశోధన నిధులు సెమీ కండక్టర్లకు మళ్లించండి, సబ్సిడీలతో పాటు పరిశోధనలకూ నిధులు ఇవ్వండి. ఇప్పటికి ఇంతటితో ముగిస్తున్నా.

- తోటి భారతీయుడు

వ్యాఖ్య

ఏకరూప చట్టం ఎవరి కోసం?

కె. గడ్డెన్న

భిన్న జాతులు, విభిన్న సంస్కృతులకు నిలయమైన సువిశాల భారతదేశంలో పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలని ఆరెస్సెస్ కుదురు నుంచి వచ్చిన బిజెపి మరోసారి చర్చను లేవదీసింది. ప్రస్తుత వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన బిల్లు తీసుకురావాలని మితవాద, మతతత్వ మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. నాలుగేళ్ల కిందటే ఈ ప్రతిపాదనను 21వ లా కమిషన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితిలో పెద్ద మార్పు లేకున్నా జస్టిస్ రితురాజ్ అధ్యక్షతన 22వ లా కమిషన్‌ను వేసింది. ఆ కమిషన్ జూన్ 14న ఏకరూప సివిల్ కోడ్ (యుసిసి)పై అభిప్రాయాలను తెలియజేయాలని కోరుతూ పబ్లిక్ నోటీస్ జారీ చేసింది. నెల రోజులు గడువు ముగిశాక మరో రెండు వారాలు పొడిగించింది. ఈలోగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బిజెపి కార్యకర్తల నుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని మోడీ ఏకరూప సివిల్ కోడ్ ఆవశ్యకత గురించి నొక్కి చెబుతూ ఒక కుటుంబంలో ఒకరికి ఒక చట్టం, మరొకరికి మరొక చట్టం ఉంటే ఆ కుటుంబం సరిగ్గా నడుస్తుందా అని ప్రశ్నించారు? అంతేకాదు, ముస్లింలను లక్ష్యంగా చేసుకుని ఆయన ట్రిపుల్ తలాక్ గురించి ప్రస్తావించారు. ఆ తరువాత ఆయన పార్టీకి చెందిన నాయకుడు న్యాయ వ్యవహారాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్‌గా ఉన్న బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ, ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ ఏకరూప సివిల్ కోడ్ నుంచి గిరిజనులను మినహాయిస్తామని చెప్పారు. దీనిని బట్టి ఒకే చట్టం ఎవరి కోసం తెస్తున్నారో? ఏ ఉద్దేశంతో తెస్తున్నారో ఈ పాటికే చాలా మందికి అర్థమైపోయింది. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేసిన చోట రామాలయ నిర్మాణం చేపట్టడం.. ముస్లింలు అధికంగా ఉన్న ఏకైక రాష్ట్రం జమ్ము కాశ్మీర్‌కు ఆర్టికల్ 370 కింద రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక స్వయంప్రతిపత్తిని రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడం.. రాష్ట్రంగా ఉన్న జమ్ము కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంత స్థాయికి దిగజార్చడం, ఎన్‌ఆర్‌సి, సిఎఎలను తీసుకురావడం.. ఇలాంటి గొలుసుకట్టు పరిణామాలు ముస్లింలను, ఇతర మైనార్టీలను తీవ్ర అభద్రతకు గురి చేశాయి.




ఈ నేపథ్యంలో ఒకే దేశం ఒకే చట్టం అన్న నినాదం మాటున ఏకరూప సివిల్‌కోడ్‌ను తెరపైకి తీసుకొచ్చింది. ఇది అన్ని మతాలు, జాతులు, సంస్కృతులకు సమ న్యాయం కల్పించేది.. లౌకిక రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేది అయితే అందరూ దీనిని స్వాగతించేవారు. కానీ, ఫాసిస్టు ఆరెస్సెస్ సిద్ధాంతం, బూజు పట్టిన మనువాద సంస్కృతి ప్రాతిపదికపై మోడీ ప్రభుత్వం దీనిని తీసుకురావాలని చూడడమే అభ్యంతరకరం. ఇంతకుముందు ఒకే దేశం ఒకే పన్ను అంటూ జిఎస్టీని తీసుకొచ్చి సామాన్యులపై చివరికి స్కూలుకెళ్లే బాలికలు ఉపయోగించే శానిటరీ ప్యాడ్‌లను కూడా వదలకుండా ఎడాపెడా పన్నులు విధించింది. దీంతో అన్ని రకాల సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో సామాన్యుల బతుకులు దుర్భరంగా మారాయి. తరువాత ఒక దేశం ఒకే భాష నినాదాన్ని ముందుకు తెచ్చి ద్రవిడ సంస్కృతిని దెబ్బ తీసేలా హిందీని బలవంతంగా రుద్దాలని ఎలా ప్రయత్నించిందీ చూశాం. ఇప్పుడు ఒక దేశం ఒకే చట్టం పేరుతో తీసుకొస్తున్న యుసిసి ఇంతకన్నా భిన్నంగా ఉంటుందని ఎలా అనుకోగలం? ఈ ఏకరూప సివిల్ కోడ్‌కు ఏది ప్రాతిపదిక? పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వాటిని దేని ఆధారంగా నిర్ణయిస్తారు? ఆరెస్సెస్ అనుసరించే మనువాదాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే అది ఇతర మతాల వారి విశ్వాసాలను, వ్యక్తిగత చట్టాలను దెబ్బతీయడం కాదా? ఇటువంటి ఏకరూపతతో సమానత్వం సాధిస్తామనడం మోసపూరితం కాదా? ఏకరూప సివిల్ కోడ్‌ను సమర్థించుకోవడానికి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల గురించి, ఆర్టికల్ 44 గురించి పదే పదే ప్రస్తావిస్తుంటారు. ఆదేశిక సూత్రాల్లో అందరికీ విద్య, అందరికీ ఆరోగ్యం, అందరికీ పని కల్పించడం వంటి అనేక అంశాలున్నాయి. వాటిని వదిలిపెట్టి ఏకరూప సివిల్ కోడ్ గురించే మాట్లాడడంలో ఆంతర్యమేమిటి? రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ ఏకరూప సివిల్ కోడ్ కావాలని అన్నా, అది ఆయా సెక్షన్ల నుంచి స్వచ్ఛందంగా రావాలే తప్ప పై నుంచి రుద్దకూడదని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం చేస్తున్నది అంబేద్కర్ చెప్పిన దానికి పూర్తి భిన్నంగా ఉంది. ముస్లిం మహిళలకు న్యాయం చేకూర్చేందుకు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తూ చట్టం తీసుకొచ్చామని ఆరెస్సెస్, బిజెపి నేతలు చెప్పడం వారి హిపోక్రసీని తెలియజేస్తుంది. హిందూ మహిళల పట్ల వివక్షను తొలగించేందుకు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సూచన మేరకు తొలి న్యాయశాఖ మంత్రి డా. బి.ఆర్.అంబేద్కర్ హిందూ కోడ్‌ను తీసుకొచ్చినప్పుడు హిందూ సంస్కృతిని నాశనం చేస్తున్నాడని ఆయనపై ఆరెస్సెస్, బిజెపి పూర్వ అవతారమైన భారతీయ జన సంఘ్ (బిజెఎస్) తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన సంగతి మరచిపోయారా?

ఏకరూప సివిల్ కోడ్‌ను సమర్థించుకోవడానికి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల గురించి, ఆర్టికల్ 44 గురించి పదే పదే ప్రస్తావిస్తుంటారు. ఆదేశిక సూత్రాల్లో అందరికీ విద్య, అందరికీ ఆరోగ్యం, అందరికీ పని కల్పించడం వంటి అనేక అంశాలున్నాయి. వాటిని వదిలిపెట్టి ఏకరూప సివిల్ కోడ్ గురించే మాట్లాడడంలో ఆంతర్యమేమిటి? రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఏకరూప సివిల్ కోడ్ కావాలని అన్నా, అది ఆయా సెక్షన్ల నుంచి స్వచ్ఛందంగా రావాలే తప్ప పై నుంచి రుద్దకూడదని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం చేస్తున్నది అంబేద్కర్ చెప్పిన దానికి పూర్తి భిన్నంగా ఉంది.

అంబేద్కర్ హిందూ కోడ్‌ను ప్రతిపాదించినప్పుడు దానిని పూర్తిగా వ్యతిరేకించింది ఆరెస్సెస్. సామాజిక దురాచారాలైన సతీ సహగమనం, బాల్య వివాహాలు అక్కడక్కడ ఇప్పటికీ కొనసాగుతున్న పరిస్థితి చూస్తున్నాం. మనుస్మృతిలో పేర్కొన్న చాతుర్వర్ణ వ్యవస్థను ఆరెస్సెస్, బిజెపి పూర్తిగా సమర్థిస్తున్నాయి. దళితులు, గిరిజనులపై దాడులు, వారి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగిపోతోంది. స్వాతంత్ర్యానంతరం హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955, నెహ్రూ ప్రభుత్వం తీసుకొచ్చినప్పుడు దానికి వ్యతిరేకంగా నానా యాగీ చేసింది సంఘ్‌పరివార్. ఇవన్నీ చట్టాలు లేకపోవడం వల్ల కొనసాగుతున్నాయా? చట్టాలు అమలు చేసే చిత్తశుద్ధి పాలకులకు లేదు. అంతేకాదు, ఏ చట్టమైనా ప్రజల ఉద్యమాల నుంచి వచ్చినదైతే అమలులోనూ ఆ ప్రభావం కనిపిస్తుంది. ప్రజలను చైతన్య పరచడం, వారిని ఉద్యమించేట్లు చేయడం పాలకవర్గ పార్టీలకు అసలు నచ్చదు. నిరంకుశంగానో, బలవంతంగానో చట్టాలను తీసుకొచ్చి, ప్రజలను జాతి, మతం, భాష, ప్రాంతం, లింగం పేరుతో చీల్చడం ద్వారా తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడంపైనే వాటి దృష్టంతా. ఏకరూప సివిల్ కోడ్ కూడా ఈ దుష్ట తంత్రంలో భాగమే. అందుకే దీనిని తుదకంటా వ్యతిరేకించాలి. వివిధ మతాల చట్టాల్లోని లోపభూయిష్టమైన, ప్రగతి నిరోధకమైన అంశాలపై ఆయా మతాల్లోంచి తిరుగుబాటు వచ్చేలా చూడాలి. ఆ తరువాతే ఏకరూప సివిల్ కోడ్ గురించి ఆలోచించవచ్చు.

★

సెటైర్



ఆ ఎర్రని కళ్ల వెనుక ...

కళ్లలోకి కళ్ళు పెట్టి చూడవెందుకు... టీవీలో పాటొస్తోంది. చూడను గాక చూడను...ముందే కళ్ళకలక నడుస్తోంది. అసలు కళ్ళలోకి చూడకున్నా కూడా వస్తోందట ఈ ఎరుపు కళ్ళ రోగం. ఇది కరోనా కంటే ముందరిదే కాని దాదాపు దానికి తీసుకునే జాగ్రత్తలే దీనికీ తీసుకోవాలి. చేతులు కడుక్కుంటూ ఉండాలంట, కళ్ళు కూడా అప్పుడప్పుడూ మంచి నీటితో కడుక్కోవడం ప్రత్యేకం. ఎవరో బాగుపడుతుంటే ఓర్వలేక...లేదంటే కోపంగా ఉన్నప్పుడు కళ్ళెర్ర చేశారంటారు. కాని ఇప్పుడు ఏ ఫీలింగు లేకనే నేత్రములు రుధిరవర్ణంలోకి పోతున్నాయి. అసలు ఈ కళ్ళ కలక లేకుండానే మన కళ్ళు ఎర్రగా ఉండాలెప్పుడూ. ఎందుకు అని మీరడుగుతారని ముందే తెలుసు, అందుకే చెబుతున్నా.

గ్యాస్ బండ రేటు పైపైకి, పెట్రోలు డీజలు ఇంక చెప్పొద్దు. వాటివల్ల అన్నీ పెరిగాయి. ఇక జి.ఎస్.టి బాదుడు, నల్లధనం చూస్తేనా ఇంకా వెనక్కి రాలేదు. నోట్ల రద్దు ఓ హుళక్కి. ఇక తినే అన్ని వస్తువుల ధరలు ఏం తినేటట్టు లేదు అన్నట్టే ఉన్నాయి. టొమాటోలకు ఒక ఫోటో తీసి ఆహా నా భోజనమంట అనుకుంటూ తినవలసిన రోజులు. ఇక మణిపూర్ మంటలు చూడనట్టు మౌన నటన. సోదరులను ఎప్పటికప్పుడు చీల్చే బిల్లులు. ఒకరిమీద ఒకరు బురద జల్లుకునేవారు పెద్దాయనంటే మాకు అతి గౌరవం అని నిరూపించుకునేందుకు ప్రతి బిల్లుకు మద్దతు పలికి మెచ్చుకోలు కోసం తహతహలు.

ఇలా వీటన్నింటికీ కళ్ళెర్ర చేయలేని జనాలకు ఈ కళ్ళకలక ఓ ఛాన్సు అనే చెప్పాలి. నాకూ కోపమొచ్చింది, నా కళ్ళూ ఎర్రబడ్డాయి అని అరవమని చెప్పాలి. అసలు ఆ ఎర్రటి కళ్ళను ఫోటో తీసి భద్రపరచుకొమ్మని చిన్న విన్నపం. కోపం వచ్చినప్పుడు లేదా రావలసిన కోపం రానప్పుడు ఈ ఫోటో చూసుకొని తృప్తిపడవచ్చు. ప్రయత్నించండి.

- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం పన్ను

● అక్టోబర్ 1నుంచి అమలు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం పన్ను విధించాలనే నిర్ణయానికి జిఎస్‌టి కౌన్సిల్ కట్టుబడి ఉంది. అక్టోబర్ 1 నుంచి దీనిని అమలు చేయాలని బుధవారం జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం ఉన్న రాష్ట్రాల్లో ఈ పన్ను విధించబడదని నిబంధనలను సవరిస్తామని చెప్పారు. సిక్కిం, గోవా విధానాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే జిఎస్‌టి చట్టానికి సవరణలు చేస్తామని సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ తెలిపారు. కేంద్ర జిఎస్‌టి చట్ట సవరణతో పాటు కొత్త పన్నుల అమలు కోసం రాష్ట్రాలు కూడా తమ జిఎస్‌టి చట్టాలను సవరించుకోవాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

ఆ యూనివర్సిటీలు నకిలీవి

● యుజిసి ప్రకటన

న్యూఢిల్లీ: దేశంలో 20 యూనివర్సిటీలను నకిలీవిగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) బుధవారం ప్రకటించింది. అలాంటి యూనివర్సిటీలు ఢిల్లీలో అత్యధికంగా ఎనిమిది ఉండగా.. ఉత్తరప్రదేశ్‌లో నాలుగు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో చెరో రెండేసి, మిగతా రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నట్లు తెలిపింది. ఈ వర్సిటీలకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారం లేదని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోని కాకుమానివారితోటలో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖలోని బైబిల్ ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియాను నకిలీవిగా యూజీసీ ప్రకటించింది.

అమెరికాకు ఫిచ్ భారీ షాక్

● అనూహ్యంగా పరపతికి కోత
● ఒత్తిడిలో ప్రపంచ మార్కెట్లు
● భారత్‌లో 3.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



న్యూఢిల్లీ : ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ ఫిచ్ అమెరికాకు ఊహించని షాక్ ఇచ్చింది. ఆ దేశం పరపతికి అనూహ్యంగా కోత పెట్టింది. 'ఎఎఎ'గా ఉన్న అమెరికా సౌర్వభౌమ రేటింగ్‌ను ఎఎ ప్లస్‌కు తగ్గించింది. పరపతికి కోత పెట్టడంతో పాటుగా రానున్న మూడేళ్లలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణించొచ్చని హెచ్చరించింది. యుఎస్‌పై పెరుగుతున్న రుణ భారమే ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషించింది. ఫిచ్ ప్రకటన వైట్‌హౌజ్‌ను, ఇన్వెస్టర్లను తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ప్రభావం భారత్‌పైనా పడొచ్చనే ఇన్వెస్టర్ల ఆందోళనతో సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. భారత మార్కెట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.3.5 లక్షల కోట్లు ఆవిరయ్యింది. అమెరికా మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. డోజోన్స్ 155 పాయింట్లు లేదా 0.4 శాతం, ఎస్‌అండ్‌పి 500 సూచీ 0.8 శాతం చొప్పున నష్టాలతో మొదలయ్యాయి. వచ్చే మూడేళ్లలో అమెరికా బిల్లుల చెల్లింపుల్లో సామర్థ్యం తగ్గొచ్చని ఫిచ్ పేర్కొంది. ఇటీవలే స్టాండర్డ్ అండ్ పూర్ (ఎస్‌అండ్‌పి) ఎజెన్సీ అమెరికా పరపతిని ఎఎఎకు తగ్గించింది. ఫిచ్ రేటింగ్‌ను యుఎస్ ట్రెజరీ సెక్రటరీ జానెట్ యెల్లెన్ తప్పుబట్టారు. ఇది ఏకపక్ష చర్య అని.. పాత డేటా ఆధారంగా రూపొందించిందన్నారు. వైట్‌హౌజ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

అమెరికా రేటింగ్‌కు కోత పెట్టడంతో ఆ దేశం సహా యూరప్, ఆసియా మార్కెట్లు నష్టాలను చవి చూశాయి. బుధవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ ఓ దశలో 1000కి పైగా పాయింట్లు నష్టపోయింది. తుదకు 677 పాయింట్లు లేదా 1 శాతం కోల్పోయి 65,783కు దిగజారింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 207 పాయింట్లు లేదా 1.05 శాతం నష్టపోయి 19,527 వద్ద ముగిసింది. అమ్మకాల ఒత్తిడితో బిఎస్‌ఇ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.4 శాతం పతనమయ్యాయి. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 2.6 శాతం విలువ కోల్పోగా.. లోహ సూచీ 2 శాతం నష్టపోయింది. సెన్సెక్స్ 30లో నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, టెక్ మహీంద్రా మినహా మిగిలిన అన్ని షేర్లూ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 82.58గా ఉంది.

చౌక గృహ రుణాలు భారం

● ఇఎంఐ వ్యయాల్లో 20% పెరుగుదల
● రెండేళ్లుగా పెరుగుతోన్న వడ్డీ రేట్లు
● పడిపోతున్న అమ్మకాలు

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

చౌక గృహాల కొనుగోలుదారులు వడ్డీల భారంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. గత రెండేళ్లలో గృహ రుణ రేట్లు పెరగడంతో నెలవారి వాయిదాలు భారీగా చెల్లించాల్సి వస్తోంది. ఈ అధిక రేట్ల పరిణామంపై తక్కువ ఆదాయ రుణ గ్రహీతలు బెంబేలెత్తుతున్నారు. మరోవైపు ఈ విభాగంలో అమ్మకాలు పడిపోతున్నాయి. చౌక లేదా సరసమైన ధరల విభాగంలోకి వచ్చే రూ.30 లక్షల వరకు గృహ రుణాలపై ఫ్లోటింగ్ వడ్డీ రేట్లు 2021లో 6.7 శాతంగా ఉండగా.. ప్రస్తుతం ఈ రేట్లు దాదాపు 9.15 శాతానికి పెరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ రిపోర్ట్ వివరాలు.. అధిక వడ్డీ రేట్ల వల్ల చౌక ధరల గృహాల అమ్మకాలు పడిపోతున్నాయి. 2023 ప్రథమార్థం (హెచ్1)లో నివాస అమ్మకాలు 20 శాతం తగ్గాయి. 2022 ఇదే సమయంలో 11 శాతం విక్రయాలు క్షీణించాయి. మొత్తం గృహ అమ్మకాల్లో 2022 ప్రథమార్థంలో 23 శాతం వాటా కలిగిన చౌక గృహాలు.. ఈ ఏడాది ప్రథమార్థంలో 18 శాతానికి తగ్గాయి. అన్‌రాక్ డాటా ప్రకారం.. భారత్‌లో సరసమైన గృహాలకు అధిక డిమాండ్ ఉంది. ఈ విభాగంలోని చాలా మంది కొనుగోలుదారులు తమ ఇళ్లను కొనుగోలు చేయడానికి బ్యాంకులు లేదా హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఇచ్చే రుణాలపై ఆధారపడతారు. మరోవైపు ఈ మధ్య కాలంలో ఇళ్ల ధరలు కూడా పెరిగాయి. 20 ఏళ్ల కాలవ్ రిమితితో రూ.30 లక్షల గృహ రుణంపై జులై 2021లో ప్రతీనెల రూ.22,700 వాయిదా చెల్లించాల్సి ఉంటే.. ఇప్పుడు ఆ మొత్తం రూ.27,300కు చేరింది. అంటే నెలకు దాదాపు అదనంగా రూ.4,600 భారం పెరిగినట్లయ్యింది. అంతిమంగా వడ్డీ భారం రూ.11 లక్షల వరకు చెల్లించాల్సి రావచ్చని అంచనా. "ఇఎంఐల భారం 20 శాతం పెరగడంతో అదనంగా దాదాపు రూ.11 లక్షల భారం పడనుంది. 2021లో రూ.24.5 లక్షల వడ్డీ చెల్లించాల్సి ఉండగా.. ఇప్పుడది రూ.35.5 లక్షల మేర చెల్లించాల్సి ఉంటుందని అంచనా." అని అన్‌రాక్ గ్రూప్ రీసెర్చ్ హెడ్, రీజినల్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ పేర్కొన్నారు.

బిజెపిలో జయసుధ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రముఖ సినీ నటి జయసుధ బిజెపిలో చేశారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి వ్యవహారాల ఇన్‌ఛార్జ్ తరుణ్ చుగ్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జయసుధకు పార్టీ కండువ కప్పి సభ్యత్వ రశీదును తరుణ్ చుగ్ అందిచారు. బుధవారం నాడిక్కడ బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ పాల్గొన్నారు. అంతకు ముందు కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో సినీ నటి జయసుధ సమావేశమయ్యారు. పార్టీలో చేరే అంశంతోపాటు పలు కీలక అంశాలపై చర్చించారు.

లోక్‌సభలో గందరగోళం

● నేటికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఉభయ సభల్లో బుధవారం కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో వాయిదా పర్వం కొనసాగింది. గురువారానికి వాయిదా వేశారు. బుధవారం లోక్‌సభలో అధికార, ప్రతిపక్ష సభ్యులు వ్యవహరిస్తున్న తీరుపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో బిల్లులకు ఆమోదం తెలిపే సమయంలో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎడతెగకుండా సభా కార్యకలాపాలకు అంతరాయం కల్పిస్తుండటాన్ని తప్పుబట్టారు. సభా గౌరవానికి అనుగుణంగా సభ్యులు ప్రవర్తించే వరకు తాను సభకు హాజరుకాబోనని హెచ్చరించారు. ఈ హెచ్చరికకు అనుగుణంగానే ఆయన బుధవారం సభాధ్యక్ష స్థానంలో కనిపించలేదు. మణిపూర్ సమస్యపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వయంగా పార్లమెంటులో ప్రకటన చేయాలని ప్రతిపక్ష సభ్యులు అవిశ్రాంతంగా పట్టుబట్టారు. సభ ప్రారంభమైన తరువాత కొంత సేపటికే మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం మళ్లీ గురువారానికి వాయిదా పడింది. లోక్‌సభ కార్యకలాపాలను బుధవారం వైసిపి ఎంపి మిథున్ రెడ్డి, బిజెపి ఎంపి కిరీట్ సోలంకి నిర్వహించారు. సభ్యులు శాంతియుతంగా వ్యవహరించాలని కిరీట్ కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన సభను వాయిదా వేశారు.

కుటుంబ పెన్షన్‌ను 30 శాతం పెంచాలి

● ఎఐఐపిఎ డిమాండ్
● కేంద్ర మంత్రిని కలిసిన సిపిఎం ఎంపి బ్రిట్టాస్, సంఘ నేతలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీమా సంస్థల పింఛనుదారులు కుటుంబ పెన్షన్‌ను 30 శాతం పెంచాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎఐఐపిఎ) కోరింది. ఈ మేరకు బుధవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, ఎఐఐపిఎ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. లైఫ్, జనరల్ రెండింటిలోనూ పబ్లిక్ సెక్టార్ ఇన్సూరెన్స్ సంస్థల పెన్షనర్లను ప్రభావితం చేసే కొన్ని ముఖ్యమైన సమస్యలను ఆమెకు వివరించారు. కుటుంబ పెన్షన్‌ను ఏకరీతిగా 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. తాము ఎల్‌ఐసి, ఇతర పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల్లో అత్యధిక సంఖ్యలో పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని, అత్యుత్తమ ఆర్థిక సంస్థల్లో ఒకటిగా ఎల్‌ఐసిని నిర్మించేందుకు తమ వంతు కృషి చేశామని చెప్పడానికి గర్వపడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. సేవల నుండి పదవీ విరమణ చేసిన తరువాత కూడా, తాము తమ ప్రచారం ద్వారా ఈ సంస్థల ప్రయోజనాలను ముందుకు తీసుకువెళుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ, ఆర్‌బిఐలో పెన్షన్ పథకాలతో వచ్చే ప్రయోజనాలు ఎఐసి, పిఎస్‌జిఐ సంస్థల పెన్షనర్లకు అందడం లేదని తెలిపారు. ఎల్‌ఐసి, పిఎస్‌జిఐ కంపెనీలలో కుటుంబ పెన్షన్ చెల్లింపులో 15 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐలో దీనిని 30 శాతానికి పెంచారని వివరించారు. 2019 సెప్టెంబరు నాటికి కుటుంబ పెన్షన్‌ను ఏకరీతి రేటు 30 శాతానికి పెంచాలని ఎల్‌ఐసి బోర్డ్ సిఫార్సు చేసిందని, జనరల్ ఇన్సూరర్స్ పబ్లిక్ సెక్టార్ అసోసియేషన్ (జిఐపిఎస్ఎ) పాలకమండలి కూడా 2021 డిసెంబర్‌లో సిఫార్సు చేసిందని తెలిపారు. ఈ సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం అందుతున్న కుటుంబ పింఛను సరైన జీవన ప్రమాణాలను నిర్వహించడానికి సరిపోవడం లేదని, చాలా మంది కుటుంబ పింఛనుదారులు ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. అందువల్ల, ఈ సిఫార్సుల ఆమోదం కోసం వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని, కుటుంబ పెన్షనర్లకు సహాయం చేయాలని కోరారు. పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులందరికీ డియర్నెస్ అలవెన్స్ (డిఎ) ఏకరీతి రేటు చేసే ఒక ఫార్ములాను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రాలో పొగాకు ఉత్పత్తి పరిమాణం పెంచండి

● కేంద్ర కార్యదర్శిని అభ్యర్థించిన వైసిపి ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో వర్జీనియా పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని 2023-24 పంట సీజనులో 170 మిలియన్ కిలోలకు పెంచాలని కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్ అగర్వాల్‌ను వైసిపి ఎంపిలు అభ్యర్థించారు. ఈ ఏడాదిలోనూ వర్జీనియా పొగాకు ఉత్పత్తి పరిమాణం గతేడాది మాదిరిగానే 142 మిలియన్ కిలోలుగా ఉండాలని, ఇటీవల సమావేశంలో పొగాకు బోర్డు తీర్మానించిందని తెలిపారు. ఈ పరిమాణాన్ని 170 మిలియన్ కిలోలకు పెంచాలని వైసిపి ఎంపిలు కోరారు. వైసిపి ఎంపిలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్ కలసి వినతిని కేంద్ర సెక్రటరీకి అందజేశారు. ఈ విషయంలో కేంద్ర కార్యదర్శి రాకేశ్ అగర్వాల్ సానుకూలంగా స్పందించినట్లు వైసిపి ఎంపిలు తెలియజేశారు.

పంచాయతీ నిధుల మళ్లింపుపై సిబిఐ విచారణ జరిపించాలి

● కేంద్ర మంత్రిని కోరిన టిడిపి ఎంపిలు, సర్పంచులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ నిధుల మళ్లింపుపై విచారణ జరిపించాలని టిడిపి ఎంపిలు, ఎపి సర్పంచుల సంఘం, ఏపి పంచాయతీరాజ్ ఛాంబర్ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కపిల్ మోరేశ్వర్ పటేల్‌ను టిడిపి ఎంపిలు కనకమేడల రవీంద్ర కుమార్, కె.రామ్మోహన్ నాయుడు, పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి వి.లక్ష్మీ ముత్యాలరావు, సర్పంచుల సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీలకు చెందిన రూ.8,660 కోట్లను మళ్లించారని, దీనిపై సిబిఐ విచారణ జరపాలని కోరారు. ఆర్థిక సంఘం నిధులను ఏపి ప్రభుత్వం దారి మళ్లిస్తోందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. వాటాగా ఇవ్వవలసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని, మరోవైపు కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లిస్తున్నారని విమర్శించారు. దీనిపై కేంద్రమంత్రి కపిల్ మోరేశ్వర్ పటేల్ స్పందిస్తూ.. నిధుల మళ్ళింపుపై విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

కూనో పార్క్‌లో మరో చీతా మృతి

● 5 నెలల్లో తొమ్మిదో మరణం

భోపాల్ : ప్రాజెక్టు చీతాలో భాగంగా దక్షిణాఫ్రికా, నమీబియా నుంచి తీసుకొచ్చిన చీతాల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ పార్కులో తాజాగా మరో చీతా మరణించింది. బుధవారం ఉదయం ధాత్రి అనే ఆడ చీతా మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. చీతా మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు నెలల్లో ఇది తొమ్మిదో ఘటన కావడం గమనార్హం. దేశంలో అంతరించిపోయిన చీతాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతేడాది సెప్టెంబరులో 8 చీతాలను ఆఫ్రికాలోని నమీబియా నుంచి మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్కుకు తీసుకొచ్చారు. రెండో దశలో ఈ ఏడాది ఫిబ్రవరి 18న దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను కూనో నేషనల్ పార్కుకు తరలించారు. ఆ 20 చీతాల్లో ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు తొమ్మిది చీతాలు మరణించాయి.

బీజింగ్‌లో రికార్డుస్థాయిలో వర్షపాతం

జురుఖువు : చైనా రాజధాని బీజింగ్‌లో గత 140ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా గత కొద్ది రోజుల్లో భారీ వర్షపాతం నమోదైంది. గత శనివారం నుండి బుధవారం ఉదయం వరకు నగరంలో మొత్తంగా 744.8మిల్లీమీటర్ల (29.3 అంగుళాలు) వర్షం కురిసిందని బీజింగ్ వాతావరణ బ్యూరో తెలిపింది. 1891లో ఈ స్థాయిలో వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తన అధికార వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆనాడు నగరంలో 609 మిల్లీమీటర్లు (24 అంగుళాలు) వర్షం కురిసింది.

'సీమ'కు గోదావరి నీరు తరలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఉండేది కాదని తెలిపారు. పోలవరం నిర్వాసితులు వరద ముంపునకు గురైతే కనీసం తిండి కూడా పెట్టట్లేదని విమర్శించారు. పోలవరం ముంపు మండలాలను ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తామని, నిర్వాసితులను ఆదుకుంటామని అన్నారు. 'నేను ప్రాజెక్టుల గురించి మాట్లాడుతుంటే ఆ శాఖ మంత్రి 'బ్రో' సినిమా గురించి మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. వివేకా కూతురు ప్రాణాన్ని కూడా లెక్క చేయకుండా హత్య కేసులో పోరాడుతున్నారని అన్నారు. కడప ఎంపి అవినాష్ నంగనాచిలా మాట్లాడుతున్నాడని విమర్శించారు.

పులివెందులలో ఉద్రిక్తత

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పులివెందులలోని పూలంగళ్లసర్కిల్ వద్దకు భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు తరలివచ్చాయి అక్కడ అలజడి సృష్టించేందుకు వైసిపి శ్రేణులు యత్నించాయి. వైసిపి జెండాలు పట్టుకుని కారులో వచ్చిన ముగ్గురు కార్యకర్తలు 'జై జగన్' అంటూ నినాదాలు చేస్తూ టిడిపి శ్రేణులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో, ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహానికి గురైన టిడిపి కార్యకర్తలు వెంటపడి తరమడంతో అక్కడి నుంచి వైసిపి కార్యకర్తలు వాహనంలో పరారయ్యారు. పరిస్థితిని అదుపు చేసే పేరుతో పోలీసులు టిడిపి కార్యకర్తలపై లాఠీఛార్జి చేశారు.



మీకోసం

రెండు చెంచాల పచ్చిపాలలో నాలుగు చుక్కల వెనిగర్ కలిపి దూదితో ముఖంపై తుడిస్తే మొటిమలు, మచ్చలు తగ్గిపోతాయి.

జీవన సౌరభం

బాధ్యతను గ్రహించినప్పుడే ఆశయాలను పూర్తి చేసుకోవాలనే పట్టుదల వస్తుంది.

ఆరోగ్యంగా ఉందాం


కోకోలొద్దు... కోలాలొద్దు...
రస్నాలొద్దు ... రంగునీళ్లొద్దు...
బండిమీదమ్మే బొండ బజ్జీలొద్దు
కెఫిన్ వుండే కాఫీ టీ లొద్దు

బోండంలోని కొబ్బరినీళ్లు
చలాకీనిచ్చే చెరకుగడ రసం
చలువచేసే తాటిముంజలు
సాఫీగా అరిగే సీజనల్ పండ్లు

పెరుగు చిలికిన పలుచటి మజ్జిగ
మొక్కలు మొలచిన పప్పులు, గింజలు
వీటినే కొందాం.. వెంటనే తిందాం..
ఆరోగ్యంగా ఉందాం.. ఆనందంగా ఉందాం..



- డాక్టర్ దార్ల బుజ్జిబాబు,
9290504570



లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు ఇచ్చి గణించాం.. వాటి ఎదురుగా ఇచ్చిన సమాధానాలను బట్టి చివరి వరుస జవాబు మీరు కనిపెట్టండి.

జవాబు : 67

నేను గీసిన బొమ్మ





- అలిమెల్లి వల్లభ్, ఐఆర్ఐఎస్ స్కూలు, సిద్ధిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇదీ, నా కేరళ స్టోరీ..

మన గురించో, మన వారి గురించో ఎవరైనా లేని పోనివి కల్పించి తప్పుగా మాట్లాడితే మనకు చాలా కోపం వచ్చేస్తుంది. వారితో వాదిస్తాం. వారి మాటలను ఖండిస్తాం.. మన గురించి, మన వారి గురించి నిజాలేమిటో గొప్పగా చెబుతాం. సరిగ్గా ఇలాగే ఆలోచించాడు కేరళవాసి సాను కుమ్మిల్. కొన్ని నెలల క్రితం బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ తెరకెక్కించిన 'ది కేరళ స్టోరీ' చిత్రంలో రెండు మతాలకు చెందిన మనుషుల స్వార్థప్రయోజనాలను చూపించడం అతను తట్టుకోలేకపోయాడు. జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న సాను అప్పడప్పుడూ తన అభిరుచి ప్రకారం చిన్న చిన్న డాక్యుమెంటరీలు రూపొందించేవాడు. ఈసారి తను ఎంతగానో అభిమానించే తన రాష్ట్రం గురించి, ప్రజల మానవత్వ హృదయాల గురించి, అక్కడ నెలకొన్న మతసామరస్యం గురించి చూపించాలనుకున్నాడు. కేరళ వ్యాప్తంగా పర్యటించిన అతడి అనుభవం కేరళ ప్రత్యేకతకు నిలువుటద్దం.

'మలప్పురమ్ కాయ్‌పట్టాలో నివసిస్తున్న జలాల్‌ను నేను మొట్టమొదట కలిశాను. 'మరణించడం ప్రతి జీవికి సర్వసాధారణం. నా దృష్టిలో మానవులు కూడా జీవులే.. మతం పేరుతో వారిని వేరుగా ఎందుకు చూడాలి?' అంటూ తన సొంత భూమిలో 19 మంది పేద హిందువుల మృతదేహాల ఖననానికి అనుమతి ఇచ్చిన జలాలుద్దీన్‌లో నాకు గొప్ప మానవతామూర్తి కనిపించాడు. అంతేకాదు, ఆ భూమిలో ఓ మూల హిందువుల దేవాలయం నిర్మించుకునేందుకు కూడా జలాల్ అనుమతి ఇచ్చాడు. 'ఈ భూమి ఓ ముస్లింది అయినంత మాత్రాన దేవాలయంలో దీపం వెలగకుండా ఉండదు కదా.. ఒక వేళ దీపం వెలగకుండా ఉంటే ఆ భూమి మీకు ఇచ్చేస్తా..'నని తన పని నచ్చక విమర్శించిన వ్యక్తులతో అన్నట్లు 79 ఏళ్ల జలాల్ నాతో చెప్పాడు. ఈ అనుభవమే నా డాక్యుమెంటరీ లో ఓ సన్నివేశంగా తెరకెక్కించాను.

'జలాల్ భాయ్ దగ్గర ఎదురైన అనుభవంతో రెట్టింపు ఉత్సాహంతో ఈసారి మలప్పురమ్ నుండి త్రిసూర్‌కు ప్రయాణం కొనసాగించాను. అక్కడ ఓ ముస్లిం పాఠశాలలో సంస్కృత పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడిని చూశాను. ఆ స్కూలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఇబ్రహీం ఈ విషయంపై మాట్లాడుతూ 'విద్యార్థులు ఇతర మతాల గురించి తెలుసుకోవడం వల్ల అన్ని సంస్కృతులు వారికి పరిచయమవుతాయి. మతాలన్నీ మానవత్వం గురించే చెప్పాయి' అంటున్న వీడియో కూడా నా డాక్యుమెంటరీలో కనిపిస్తుంది. ఆ తరువాత నుదిటిపై విభూదిరేఖలతో హిందుత్వం ఉట్టిపడుతున్న యతేంద్రన్ మాస్టారు, ఎదురుగా తెల్లటి టోపీలు ధరించిన ముస్లిం యువకులకు పాఠాలు



చెప్పడం చూశాను. ఆ క్లాసు రూంలో నల్లబోర్డుపై సంస్కృతంలో రాసిన అండర్‌లైన్ చేసిన 'మనుష్యత్వం'(తెలుగులో మానవత్వం) మాటను కూడా నా డాక్యుమెంటరీలో చూపించానని సాను చెప్పారు.

ఈసారి సాను కెమెరా మట్టన్‌చెర్రి వైపు తిరిగింది. అక్కడ యూదు సంతతికి చెందిన కోహెన్ దంపతులు ఓ ముస్లిం అబ్బాయిని చేరదీసిన వైనం చూపించాడు. భిన్న మతానికి చెందిన పిల్లవాడిని కోహెన్ దంపతులు సాకిన వైనం ఆ చుట్టుపక్కల వారిని ఆశ్చర్యానికి గురిచేసిన సంఘటనలు కూడా అందులో వివరిస్తాడు. రెండు మతాలకు చెందిన వ్యక్తులు ఇంతటి ప్రేమానురాగాలతో మెలగడం అసాధ్యమని వాదిస్తున్న చాలామందికి ఈ ఉదంతం గొప్ప కనువిప్పుగా చూపించాడు సాను. ఆ యూదు కుటుంబం సాకిన ముస్లిం పిల్లవాడు పెరిగి పెద్దవాడై ఆ కుటుంబ వారసత్వంగా వస్తున్న వ్యాపారాన్ని నిర్వహించడం కూడా డాక్యుమెంటరీలో చూడవచ్చు. కోహెన్ భార్య చావుబతుకుల్లో ఉన్నప్పుడు ఆ ముస్లిం యువకుడు ఎంతటి ప్రేమను కనబరిచాడో.. ఆమె చివరి యాత్ర వరకు తన చేయిని విడవకుండా పక్కనే ఎలా



నిలబడ్డాడో నాలుగేళ్ల క్రితం మరణించిన తన భార్యను గుర్తు చేసుకుంటూ కోహెన్ చెబుతున్నప్పుడు రెండు మానవత్వ హృదయాలను మనకు చాలా దగ్గరగా పరిచయం చేస్తాడు సాను.

'ఆ తరువాత నా ప్రయాణం ఎర్నాకులం నుండి పెరియర్ నది వైపు సాగింది. అక్కడ 76 ఏళ్ల భారతీయమ్మ ఓ మసీదు సంరక్షణ బాధ్యతల్లో తలమునకలై ఉంది. 20 ఏళ్లుగా మసీదు నిర్వహిస్తున్న ఆమె 'దీనికి కులం, మతంతో సంబంధం లేదు. నేను వేరే మతానికి చెందిన దాన్ని. అయినా ఈ మతాన్ని కూడా గౌరవిస్తాను. ఎటువంటి అభ్యంతరం లేకుండా నాకు మసీదు నిర్వాహకులు ఈ బాధ్యత అప్పగించారు. నడవగలిగే ఓపిక ఉన్నంత వరకు నేను మసీదుకు వస్తాను' అంటూ ఆమె చెప్పిన విషయాన్ని మతసామరస్యానికి ప్రతీకగా చూపించాడు.

"ఇన్ని దృశ్యాల మధ్య పాలోడ్‌లో 'ఎలవపాలెం దగ్గర ఒక వంపులో మూడు మతాలకు చెందిన గుర్తులను చూశాను. ఎడమ వైపు దారుల్ ఇస్లాం జుమా మసీదు, కుడి వైపు కల్లుమల తంబురాన్



దేవి దేవాలయం, మధ్యలో క్రైస్తవ చిహ్నం కనిపించింది. భిన్న మతాలకు చెందిన వారంతా ఆ ప్రాంతంలో ఎప్పటినుండో మతసామరస్యంతో జీవిస్తున్నారు. వారి జీవనానికి గుర్తుగా ఆ ప్రాంతంలో ఆ వంపుతో ఉన్న బోర్డు కనిపిస్తోంది' అంటూ చెబుతూనే మరో మానవత్వ హృదయాన్ని మనకు పరిచయం చేస్తాడు. భిన్న మతానికి చెందిన ప్రియాంక నంద, స్థానిక సిపిఐ(ఎం) నాయకుడు రాజాలాల్‌కు కాలేయం దానం చేయడానికి ముందుకు వచ్చిన వైనాన్ని ఈ డాక్యుమెంటరీలో చూపించాడు. అలాగే కోవిడ్ 19 కాలంలో ఎక్కడి వారక్కడ ఇళ్లకే పరిమితమైన వేళ కేరళలో ఎంతోమంది మతాలకు సంబంధం లేకుండా తమ సొంతభూముల్లో కోవిడ్ మృతదేహాల ఖననానికి అనుమతులిచ్చిన వైనం వివరించాడు.

'ఇదీ నా కేరళ స్టోరీ.. ఎవరూ చెప్పనిదీ... 'అన్‌టోల్డ్ కేరళ స్టోరీ' అంటూ కేరళలో వెల్లివిరిసిన మానవత్వాన్ని, మతసామరస్యాన్ని మన కళ్లముందుంచిన సాను లాంటి వాళ్లు చాలా అరుదుగా కనిపిస్తారు.



జీర్ణశక్తిని పెంచే 'బొప్పాయి'

బొప్పాయి పండులో ఉన్నన్ని విటమిన్లు మరెందులోనూ లేవంటారు వైద్యులు. ఈ పండును ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం చాలా బాగుంటుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. బొప్పాయిలో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, విటమిన్ డి తగిన మోతాదులో ఉంటాయని పేర్కొంటున్నారు. బొప్పాయి ఆకుల రసం తాగితే కూడా... ఎర్ర రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. భోజనం తర్వాత బొప్పాయి తింటే ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. పొట్ట, పేగుల్లో విష పదార్థాల్ని తొలగిస్తుంది.

బొప్పాయిలోని ఫ్లేవనాయిడ్స్, పొటాషియం, మినరల్స్, కాపర్, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. డెంగీ ఫీవర్‌తో బాధపడే వారు తప్పనిసరిగా బొప్పాయి తినాలి. ఫలితంగా ప్లేట్ లెట్స్ వేగంగా పెరుగుతాయి. బొప్పాయి ఆకుల రసం తాగినా చక్కటి ఫలితం ఉంటుంది. ఫ్లేవనాయిడ్స్, పొటాషియం, మినరల్స్, కాపర్, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. క్యాలరీలు తక్కువే. అందువల్ల ఎక్కువగా తిన్నా బరువు పెరిగే ప్రమాదం ఉండదు. పైగా... ఇది చెడు కొవ్వును తరిమేస్తుంది. గుండెకు రక్తం చక్కగా సరఫరా అయ్యేలా చేస్తుంది. మూత్ర పిండాల్లో రాళ్లు ఉండే వారికి బొప్పాయి ఔషదం. రెగ్యులర్‌గా తింటే, మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లను అరికట్టొచ్చు. అలసట, నీరసం వంటి అనారోగ్య సమస్యల్ని తొలగిస్తుంది. కాన్సర్‌పై పోరాడే గుణాలు బొప్పాయిలో ఉన్నాయి. ఇందులో బీటాకెరోటిన్, లూటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు కాన్సర్ వైరస్‌తో పోరాడతాయి. ఇది కొలన్, గర్భాశయ కాన్సర్లను తగ్గిస్తుంది.

మరోసారి చిక్కుల్లో ట్రంప్!

- 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల తారుమారుకు యత్నించిన కేసులో చార్జిషీట్ ఖరారు
- నేడు కోర్టుకు హాజరు కావాలని ఆదేశం



వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారంటూ ఆయనపై నేరారోపణలు నమోదయ్యాయి. ఆయనపై ఇలా అభియోగాలు నమోదు కావడం కేవలం నాలుగు మాసాల్లో మూడోసారి. దీంతో మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో తలపడాలనే ట్రంప్ ప్రయత్నాలకు ఎదురు దెబ్బ తగిలినట్లైంది. అధ్యక్షుడు జో బైడెన్ విజయాన్ని ధృవీకరించకుండా కాంగ్రెస్‌ను నిలువరించడం ద్వారా అమెరికాను మోసగించడానికి ట్రంప్ కుట్ర పన్నారని, అలాగే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనివ్వకుండా అడ్డుపడ్డారని ఆరోపణలు నమోదయ్యాయి. గురువారం ఫెడరల్ కోర్టుకు హాజరు కావాల్సిందిగా ట్రంప్‌ను ఆదేశించారు. ట్రంప్‌పై వచ్చిన ఆరోపణలపై స్పెషల్ కౌన్సెల్ జాక్ స్మిత్ దర్యాప్తు నేపథ్యంలో ఈ అభియోగాలు నమోదయ్యాయి. ఆనాటి అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైనా ట్రంప్ ఫలితాలను తారుమారు చేసేందుకు మరో ఆరుగురితో కలిసి కుట్ర పన్నారని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఆ ఆరుగురి పేర్లను పేర్కొనలేదు. కానీ వారిలో ఒకరు మాజీ న్యాయ శాఖ అధికారి జెఫరీ క్లార్ అని భావిస్తున్నారు. ఎన్నికలు మోసపూరితంగా జరిగాయని చేస్తున్న వాదన నిజం కాదని ట్రంప్‌కు కూడా తెలుసునని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. అయినా సరే ఎన్నికల యంత్రాంగం పట్ల ప్రజలకు విశ్వాసం కోల్పోయేలా, ప్రజల్లో ఆగ్రహం, అపనమ్మకం కలిగేలా ఒక ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించాలనుకుని పదే పదే తప్పుడు ఆరోపణలు చేశారని వారు తెలిపారు.

కాగా, ట్రంప్ ఎల్లప్పుడూ చట్టానికి అనుగుణంగానే నడుచు కున్నారని ట్రంప్ ప్రచార బృందం ఒక ప్రకటనలో పేర్కొంది. నాజీల పాలనను తలపించేలా ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని వారు విమర్శించారు. ఓటింగ్‌లో విస్తృతంగా అవకతవకలు జరిగాయన్న తప్పుడు ఆరోపణల ఆధారంగా ట్రంప్ తమపై ఒత్తిడి తీసుకువచ్చారని అధికారులు కూడా విచారణా కమిటీ ముందు సాక్ష్యమిచ్చారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న మొదటి మాజీ అధ్యక్షుడుగా ట్రంప్ ఇప్పటికే నిలిచారు.

వోక్స్‌వ్యాగన్‌లో భారీ సంఖ్యల్లో ఉద్యోగాల్లో కోత

పోరాటాలకు కార్మికులు సిద్ధం

బెర్లిన్ : పాసింజర్ కార్ల తయారీ సంస్థ వోక్స్‌వ్యాగన్‌లో కార్మికులు, కంపెనీ యాజమాన్యంతో పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఉద్యోగాల్లో పెద్ద ఎత్తున కోతలు విధించాలని, పని పరిస్థితుల్లో మార్పులు తీసుకురావాలని కంపెనీ భావిస్తోంది. ఈ ప్రయత్నాలను కార్మికులు తీవ్రంగా నిరసిస్తున్నారు. వేసవి శలవులు ముగిసేలోగా తన ప్రణాళికలను అమలు చేయాలని కంపెనీ భావిస్తోంది. వర్క్స్ కౌన్సిల్‌తో కలిసి పనిచేస్తున్న విడబ్ల్యు యాజమాన్యం పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరణకు, విస్తృత స్థాయిలో ఉద్యోగాల్లో కోతలకు సన్నద్ధమవుతోంది.

ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు బాగా క్షీణించడంతో కంపెనీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. టెస్లా నుండి, చైనా, ఇతర అంతర్జాతీయ కార్ల తయారీ సంస్థల నుండి బలమైన పోటీ వున్న నేపథ్యంలో అమ్మకాలు బాగా పడిపోయాయి. దీనికి తోడు, ఇన్వెస్టర్ల నుండి కూడా తమ లాభాలను ప్రస్తుతమున్న మూడు శాతం నుండి 9శాతానికి పెంచాలని డిమాండ్ వస్తోంది. దీంతో, కార్మిక శ్రమ శక్తిని దారుణంగా దోపిడీ చేయడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని కంపెనీ భావిస్తోంది. ఈ దిశగా ఇటీవలి వారాల్లో వరుసగా సమావేశాలు జరుగుతున్నాయి. విడబ్ల్యు బ్రాండ్ భవితవ్యం పణంగా పెట్టబడుతోందని విడబ్ల్యు కంపెనీ బాస్ థామస్ షెఫర్ ప్రకటించారు. ఇది తుది మేల్కొలుపు అని, ఇప్పటికైనా మనం మేల్కొనకపోతే పరిస్థితి చేయి దాటుతుందని హెచ్చరించారు. ఈ బ్రాండ్ లాభదాయకంగా వుండాలంటే ఉత్పత్తి క్రమాలను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాల్సి వుందన్నారు.

18 ఏళ్లలోపు వారు సహజీవనం చేయడం చట్ట విరుద్ధం

లక్నో: 18 ఏళ్లలోపు వారు సహజీవనం చేయడం చట్ట విరుద్ధం, అనైతికమని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. సహజీవనాన్ని వివాహపరమైన సంబంధంగా పరిగణించేందుకు కొన్ని పరిమితులు ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది. 18 ఏళ్లలోపు ఉన్న అబ్బాయి.. వయస్సులో తన కంటే పెద్దదైన అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడనే కారణంతో నేర విచారణ నుంచి రక్షణ పొందలేడని, వారి చర్యలు చట్టపరమైనవి కాదని జస్టిస్ వివేక్ కుమార్ బిర్లా, జస్టిస్ రాజేంద్ర కుమార్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. కొద్దిరోజుల క్రితం ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అమ్మాయి, 17 ఏళ్ల అబ్బాయి ఇంట్లోంచి వచ్చి ప్రయాగ్‌రాజ్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో అమ్మాయి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటన మొత్తాన్ని అబ్బాయి తండ్రికి అమ్మాయి తెలియజేసింది. దీంతో ఆయన అబ్బాయి తరపున కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బస్సు కిందపడి చిన్నారి మృతి

- గుంతల రోడ్డుపై స్కిడ్ అయిన స్కూటీ
- కింద పడిన బాలికపై నుంచి వెళ్లిన స్కూల్ బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలకు గుంతలమయమైన మహానగర రోడ్డు చిన్నారి ప్రాణం పోవడానికి కారణమైంది. ఇందుకు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు వేగమూ తోడైంది. రోడ్డుపై గుంత వల్ల స్కూటీ స్కిడ్ అయి కింద పడిపోయిన చిన్నారిపై నుంచి స్కూల్ బస్సు వెళ్లడంతో చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన హైదరాబాద్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



బాచుపల్లి నివాసితుడు కిషోర్ కూతురు దీక్షిత(8) బౌరంపేట్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 3వ తరగతి చదివేది. రోజూ కిషోర్ స్కూటీపై దీక్షితను బుధవారం స్కూల్‌కి తీసుకువెళ్తుండగా బాచుపల్లి రెడ్డిల్యాబ్స్ వద్ద గుంతల రోడ్డుపై స్కూటీ అదుపుతప్పడంతో దీక్షిత కింద పడిపోయింది. అదే సమయంలో వెనుకాల వేగంగా వచ్చిన భాష్యం స్కూల్ బస్సు స్కూటీని ఢీకొట్టి చిన్నారిపై నుంచి వెళ్లింది. బస్సు వేగంగా ఉండటం వల్ల డ్రైవర్ రహీం అదుపు చేయలేకపోయారు. దాంతో దీక్షిత అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె తండ్రి చేయి విరిగింది. స్థానికులు వెంటనే బాచుపల్లి పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్కూల్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీక్షితను గాంధీ ఆస్పత్రికి తరలించారు. కిషోర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సిరీస్ విజేత టీమిండియా

- చివరి వన్డేలో 200 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై గెలుపు
- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ఇషాన్

ట్రినిడాడ్: వెస్టిండీస్‌తో జరిగిన మూడో, చివరి వన్డేలో భారత్ ఘన విజయం సాధించింది. మంగళవారం రాత్రి జరిగిన మూడో వన్డేలో టీమిండియా 200పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-1తో కైవసం చేసకుఉంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 351పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో వెస్టిండీస్‌ను 151పరుగులకే ఆలౌట్ చేసింది. తొలుత శుభ్‌మన్(85), ఇషాన్(77), సంజు(51), హార్దిక్(70నాటౌట్) అర్ధసెంచరీలతో కదం తొక్కారు. దీంతో టీమిండియా ఈ పర్యటనలో తొలిసారి భారీస్కోర్‌ను నమోదు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ జట్టు భారత బౌలర్లు ఆది నుంచే కట్టడి చేశారు. ఈ క్రమంలో విండీస్ జట్టు 88పరుగులకే 8వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో నిలిచింది. ఆ తర్వాత మోటీ(39నాటౌట్), అల్జరీ జోసఫ్(26)లు తొమ్మిదో వికెట్‌కు 55పరుగులు జతచేయడంతో ఆమాత్రమైనా స్కోర్ చేయగల్గింది. శార్దూల్‌కు నాలుగు, ముకేశ్ కుమార్‌కు మూడు, కుల్దీప్ యాదవ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శుభ్‌మన్‌కు, సిరీస్ ఇషాన్ కిషన్‌కు లభించాయి. ఐదు టి20ల సిరీస్ గురువారం నుంచి ప్రారంభం కానుండగా.. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో చేజిక్కించుకుంది.



తొలి టి20 నేడు..
భారత్ X వెస్టిండీస్
(రాత్రి 8.00గం॥లకు; ట్రినిడాడ్)

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (స్టంప్)హోప్ (బి)కరియా 77, శుభ్‌మన్ (సి)కరియా (బి)మోటీ 85, గైక్వాడ్ (సి)కింగ్ (బి)జోసెఫ్ 8, సంజు (సి)హెట్‌మెయిర్ (బి)షెఫర్డ్ 51, హార్దిక్ (నాటౌట్) 70, సూర్యకుమార్ యాదవ్ (సి)కరియా (బి)షెఫర్డ్ 35, జడేజా (నాటౌట్) 8, అదనం 17. (50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 351పరుగులు. **వికెట్ల పతనం:** 1/143, 2/154, 3/223, 4/244, 5/309, **బౌలింగ్:** సెలిస్ 8-0-75-0, మయర్స్ 4-0-25-0, జోసెఫ్ 10-0-77-1, మోటీ 10-1-38-1, షెఫర్డ్ 10-0-73-2, కరియా 8-0-58-1.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి)ఇషాన్ (బి)ముఖేశ్ 0, మయర్స్ (బి)ముఖేశ్ 4, అథంజే (బి)కుల్దీప్ 32, హోప్ (సి)శుభ్‌మన్ (బి)ముఖేష్ 5, కర్టీ (సి)శుభ్‌మన్ (బి)ఉనాద్కట్ 6, హెట్‌మెయిర్ (సి)సూర్యకుమార్ (బి)శార్దూల్ 4, షెఫర్డ్ (సి)ఉనాద్కట్ (బి)శార్దూల్ 8, కరియా (ఎల్‌బి)కుల్దీప్ 19, జోసెఫ్ (సి)ఇషాన్ (బి)శార్దూల్ 26, మోటీ (నాటౌట్) 39, సెలిస్ (బి)శార్దూల్ 1, అదనం 7. (35.3ఓవర్లలో ఆలౌట్) 151పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/7, 3/17, 4/35, 5/40, 6/50, 7/75, 8/88, 9/143, 10/151 **బౌలింగ్:** ముఖేశ్ కుమార్ 7-1-30-3, హార్దిక్ పాండ్యా 4-1-13-0, శార్దూల్ 6.3-0-37-4, ఉనాద్కట్ 5-0-16-1, కుల్దీప్ 8-3-25-2, జడేజా 5-1-29-0.

మంజునాథ్ మాజీ ప్రపంచ ఛాంపియన్‌కు ఝలక్

- ప్రణయ్, శ్రీకాంత్ శుభారంభం
- గాయంతో వైదొలిగిన లక్ష్యసేన్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో పివి సింధుతో పాటు హెచ్‌ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ తొలి అడ్డంకిని అధిగమించారు. మహిళల సింగిల్స్‌లోపివి సింధు 21-18, 21-13తో సహచర క్రీడాకారిణి ఛాలిహాపై, ఆకర్షి కశ్యప్ 21-15, 21-17తో జొహో(మలేషియా)పై వరుససెట్లతో గెలిచారు. మరో పోటీలో మాల్విక బన్సోద్ 20-22, 11-21తో వైపి పై(చైనీస్ తైపీ) చేతిలో ఓడింది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-18, 21-7తో 8వ సీడ్ కెంటో నిషిమోటో(జపాన్)పై, ప్రియాంశు రాజవత్ 21-12, 21-16తో టంగ్(ఆస్ట్రేలియా)పై గెలుపొందగా.. మిథున్ మంజునాథ్ 21-19, 21-19తో మాజీ ప్రపంచ ఛాంపియన్ లో కెన్ యూ(సింగపూర్)పై, హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ 21-18, 16-21, 21-15తో సివై లీ(హాంకాంగ్)పై పోరాడి నెగ్గాడు.

ఇటలీ ఔట్..

నేటితో ముగియనున్న ఫిఫా మహిళల ప్రపంచకప్ లీగ్ పోటీలు

దక్షిణాఫ్రికా చేతిలో 3-2గోల్స్‌తో ఓటమి

సిడ్నీ: ఫిఫా మహిళల ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. బుధవారం జరిగిన గ్రూప్-జి చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మహిళలజట్టు ఏకంగా ఇటలీ జట్టును ఓడంది. రెండు అర్ధభాగాల సమయం పూర్తయ్యేసరికి దక్షిణాఫ్రికా జట్టు 3-2గోల్స్ తేడాతో ఇటలీని చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌ను కనీసం డ్రా చేసుకున్నా ఇటలీ జట్టు ప్రి క్వార్టర్స్‌కు చేరేది. మరో మ్యాచ్‌లో స్వీడన్ జట్టు 2-0గోల్స్ తేడాతో అర్జెంటీనాను ఓడించి 9పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. దీంతో ఈ గ్రూప్ నుంచి స్వీడన్, దక్షిణాఫ్రికా జట్లు నాకౌట్‌కు చేరగా.. ఇటలీ, అర్జెంటీనా జట్లు గ్రూప్ దశలోనే నిష్క్రమించాయి. నేడు మొరాకో-కొలంబియా, దక్షిణ కొరియా-జర్మనీ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ఫిఫా మహిళల ప్రపంచకప్ లీగ్ పోటీలు ముగియనున్నాయి. శనివారం నుంచి నాకౌట్ పోటీలు ప్రారంభం కానున్నాయి.



ఒకరోజు ముందుకు భారత్-పాక్ వన్డే ప్రపంచకప్ మ్యాచ్

గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఐసిసి, పిసిబి

ముంబయి: అక్టోబర్‌లో భారత్ వేదికగా జరగనున్న ప్రపంచకప్‌లో కీలకమైన భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ఒకరోజు ముందు జరగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ అక్టోబర్ 14న నిర్వహించాలని బిసిసిఐ నిర్ణయించింది. దీనికి ఐసిసితో పాటు పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు బోర్డు(పిసిబి) సైతం అంగీకారం తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం ఇరుజట్ల మధ్య అక్టోబర్ 15న ఈ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే, అదేరోజు శనరన్నవరాత్రి వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్‌ను 14న ముందే నిర్వహించాలని బిసిసిఐని అక్కడి పోలీసులు కోరిన విషయం తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68